18 సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
18 వ వసంతంలోకి ...
రంగారెడ్డి-వికారాబాద్-మేడ్చల్
గురువారం 14 నవంబర్ 2024 పేజీలు : 11

## జపాన్ పార్లమెంటు భవనాన్ని సందర్శించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (నవంబర్ 13): జపాన్ దేశ స్టడీ టూర్‌లో భాగంగా దేశ రాజధాని టోక్యో నగరంలోని జపాన్ పార్లమెంట్ భవనాన్ని (నేషనల్ డైట్)ను తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ శ్రీ బండా ప్రకాష్ ముదిరాజ్, లేజిస్లేచర్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు సందర్శించారు. ఈసందర్భంగా జపాన్ పార్లమెంట్ పనితీరును తెలంగాణ శాసన బృందానికి వివరించిన నేషనల్ డైట్ అధికారులు. ఆస్ట్రేలియా లోని సిడ్నీలో జరిగిన 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ కాన్ఫ రెన్స్ లో పాల్గొన్న అనంతరం స్టడీ టూర్ లలో భాగంగా జపాన్ చేరు కున్నారు.

## నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ పేరుతో మోసం చేసింది

- నేడు కాంగ్రెస్ ప్రభుత్వం పోర్త్ సీటి పేరుతో రైతుల మోసం చేస్తుంది
- ఫోర్త్ సిటీ భూ భాధితులకు న్యాయపరమైన నష్టపరిహారం అందించాలి
- మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జీ అందెల శ్రీరాములు



మహేశ్వరం, మేజర్‌న్యూస్ (నవంబర్ 13): నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ పేరుతో రైతులను మోసం చేసిందని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఫోర్త్ సిటీ పేరుతో రైతులను మోసం చేస్తుందని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ పార్టీ ఇంచార్జీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మీడియా మాట్లాడుతూ... మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలంలో ఫోర్త్ సిటీ ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని అన్నారు. అగర్‌మియాగూడ, లేమూర్, తిమ్మాపూర్, రాచులూరు గ్రామాల రైతుల దగ్గర నుండి ఫోర్త్ సిటీ వరకు 300 ఫీట్ల రోడ్డు నిర్మాణం కోసం భూములను ప్రభుత్వం తీసుకుంటుందని దాని విలువ 5 నుండి 6 కోట్లు వరకు పలుకుతుందని కానీ ప్రభుత్వం కేవలం 19 లక్షలు మాత్రమే చెల్లిస్తామని అంటుందని రైతులు ఆవేదన చెందుతున్నారని అన్నారు. రైతులకు వారు అడిగిన న్యాయమైన పరిహారం అందించాకే పనులు చేపట్టాలని శ్రీరాములు డిమాండ్ చేశారు.

# వికారాబాద్‌లో టెన్షన్.. టెన్షన్



- తారా స్థాయికి చేరిన లగచర్ల పంచాయతీ
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి 14 రోజులు రిమాండ్
- చర్లపల్లి జైలుకు తరలింపు
- జిల్లా కలెక్టర్ ను పరామర్శించిన సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి
- రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకోం: ఎంపీ డీకే అరుణ

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (నవంబర్ 13): వికారాబాద్ జిల్లా లో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. గత మూడు రోజుల క్రితం కొడంగల్ నియోజక వర్గం లగ చర్ల గ్రామంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, కడ అధికారి వెంకట్ రెడ్డి పై గ్రామస్తులు దాడి చేయటంతో వికారాబాద్ హాట్ టాపిక్ గా మారింది. మంగళవారం వికారాబాద్ జిల్లాలో ఉద్యోగులు ధర్నా కార్యక్రమం నిర్వహించగా, బుధవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతి రెడ్డి పరామర్శించారు. అనంతరం తిరుపతి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. మిగతా 3లో

### బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై...

# గడువులోగా నివేదిక అందజేస్తాం

– డెడికేటెడ్ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ బూసాని వెంకటేశ్వర రావు





రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (నవంబర్ 13) : జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కల్పన కోసం రాజకీయంగా వెనుకబడిన వర్గాల (బీసీ) జనాభా గణాంకాల సేకరణలో భాగంగా బుధవారం నాడు కలెక్టరేట్‌కు విచ్చేసిన డెడికేటెడ్ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ బూసాని వెంకటేశ్వర రావు, సెక్రెటరీ సైదులు ఐఎఫ్ఎస్, జిల్లా యంత్రాంగం తరపున జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్‌తో కలిసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతీమా సింగ్‌లతో కలిసి ఆయన స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి బహిరంగ చర్చను ఏర్పాటు చేశారు. మిగతా 2లో

## విద్యార్థులు క్రీడలతో పాటు విద్యాలోనూ ముందు ఉండాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (నవంబర్ 13): విద్యార్థులు క్రీడలతో పాటు విద్య లో ను ముందుండాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లాలోని శివ రెడ్డి పేట (అనంతగిరిపల్లి) సాంఘిక సంక్షేమ గురుకుల బాలల పాఠశాల/కళాశాల ఆవరణలో 10 వ జోనల్ స్థాయి పోటీలలో పాల్గొనే క్రీడాకారులతో మాట్లాడారు. వివిధ పాఠశాలల విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ ద్వారా కలెక్టర్ గారికి స్వాగతం పలికారు. మిగతా 3లో

# గ్రామాలాభివృద్ధికి కృషి

## -ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం -ఎమ్మెల్యే కాలె యాదయ్య





చేవెళ్ల, మేజర్‌న్యూస్ (నవంబర్ 13): గ్రామాల అభివృద్ధికి ఆహర్నిశలు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. రూ.కోటినిధులతో చేవెళ్ల గ్రామ రోడ్డు పనులను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... రాజకీయ పార్టీలకతీతంగా గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారంటి పథకాలు అమలు చేసి తీరుతుందన్నారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను ఒకొక్కటిగా పరిష్కరిస్తానని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ గ్రామాల్లో నెలకొన్న సమస్యపై ప్రత్యేక దృష్టి పెడుతానన్నారు. అవసరమున్న గ్రామాల్లో సీసీ రోడ్లను వేస్తామన్నారు.నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు కోసం సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో

చేవెళ్ల, ముడిమ్యాల సోసైటి చైర్మెన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, నియోజకవర్గం నాయకులు సున్నపు వసంతం, మార్కెట్ కమిటీ చైర్మెన్, వైస్ చైర్మెన్ గడ్డమీది పెంటయ్య, బ్యాగరి రాములు, టీపీసీసీ సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ గుండాల రాములు, మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్, సీనియర్ నాయకులు మర్పల్లి కృష్ణారెడ్డి, నాయకులు పొట్ట దయాకర్, జనార్ధన్ తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం....

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. నియోజకవర్గంలోని 99మందికి మంజూరైన రూ.43లక్షల37వేల చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను లబ్దిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# దాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

## - అధికారులకు కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశం



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (నవంబర్ 13) : ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నాడు కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ... నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 15 పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 1186 మంది రైతుల ద్వారా 7951 మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు చేయడం జరిగిందని, ఇప్పటి వరకు 39 మంది రైతుల ఖాతాల్లో 89.84 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు పీఏసీఎస్ - 20, డీసీఎంఎస్-07, ఐకేపీ-03 మొత్తం 30 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 42 మంది రైతుల ఖాతాల్లో 57.73 వేల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. ఇంకా 9 కేంద్రాలను ఏర్పాటు చేయవలసి ఉందని అన్నారు. ఎఈఓలు ప్రతి కొనుగోలు కేంద్రంలో ధాన్యం నాణ్యతా ప్రమాణాలు గుర్తించాలని సూచించారు. గన్ని బ్యాగ్స్, టార్పాలిన్ అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంట, వెంటనే ధాన్యం కొనుగోళ్లు జరపాలని, సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశిత రైస్ మిల్లులకు తరలించాలని, ట్యాబ్ ఎంట్రీలు త్వరగా చేయాలని సూచించారు. అన్ని రకాల రిజిస్టర్ లను సక్రమంగా నిర్వహించాలన్నారు. సమగ్ర ఇంటింటి సర్వే ను పకడ్బందీగా నిర్వహించాలని ప్రతి ఎన్యూమరేటర్ తమ పరిధిలోని ఏ ఒక్క ఇంటిని విడిచి పెట్టకుండా సర్వే నిర్వహించాలని సూచించారు. సర్వే నిర్వహిస్తున్న సమయంలో ఎలాంటి తప్పిదాలకు తావివ్వకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జెట్టి సీఈఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, సిపిఓ సౌమ్య, డిఆర్డిఏ పి డి శ్రీలత, సివిల్ సప్లై అధికారులు శ్రీనివాస్ గోపికృష్ణ జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రియాజుద్దీన్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై...

# గడువులోగా నివేదిక అందజేస్తాం

**మొదటిపేజీ తరువాయి...** ఈ బహిరంగ చర్చలో ఛైర్మన్ బూసాని వెంకటేశ్వర రావు మాట్లాడుతూ... లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, బీసీ కమిషన్, బీసీ సంఘాల నుంచి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు తీసుకుంటామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కల్పన కోసం రాజకీయంగా వెనుకబడిన వర్గాల (బీసీ) జనాభా గణాంకాల సేకరణలో భాగంగా బుధవారం బిసి ఫెడరేషన్ ఛైర్మన్ మల్లేష్ యాదవ్, విశ్వకర్మ సంఘం నుండి బ్రహ్మ చారి, నెల్వేజ్ సెల్వాచారీ, ఆది మూలం వెంకటాచారీ, రంగారెడ్డి జిల్లా పూసలసంఘం సదానందం, పగడాల యాదయ్య సిపి.ఐ.యం, వడ్డెర సంఘం మారెయ్య, వడ్డెర సంఘం రవి, మేదర సంఘం గంగాధర్, ఉప్పర సంఘం సతీష్ సాగర్, మత్స్యకారుల సంఘం గొరెంకల నర్సింహ్మా, మేదర సంఘం అందూరి శివ, యం.బి.సి ఫౌండర్ నాగేంద్ర, తెలంగాణ రజక సంఘం రాజ్ కుమార్ ల నుండి వినతులు, సలహాలు, సూచనలు తీసుకోవడం జరిగిందన్నారు. కమిషన్ కు అందిన సలహాలు, వినతులు, అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వంకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ బహిరంగ చర్చో స్థానిక ప్రజాప్రతినిధులు, పలు బిసి సంఘాల నాయకులు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పాడి పశువుల పట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

★ఏడి డాక్టర్.శ్రావణ్ కుమార్



కందుకూరు, మేజర్‌న్యూస్ ( నవంబర్ 13): సీజనల్ వ్యాధులతో పాడి పశువుల పట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఎల్‌డీఏ ఏడి డాక్టర్.శ్రావణ్ కుమార్ సూచించారు. తెలంగాణ ప్రభుత్వం పశువర్ధక శాఖ ఆద్వర్యంలో బుధవారం మండలంలోని జైత్వారంలో ఉచిత వైద్య గర్భకోశ చికిత్స శిభిరాన్ని సందర్శించారు. శిభిరంలో భాగంగా 65 ఆవులు,37 గేదెలకు చికిత్సలు అందించారు. 38 పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబధించిన చికిత్సలు అందించారు.ఈ సందర్భంగా ఏడి మాట్లాడుతూ...పాడి పశువులకు సీజనల్ వ్యాధుల గురించి జనరల్ మాస్ వ్యాక్సికేషన్ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల ప్రాధాన్యత పాల దిగుబడికి సంబంధించిన మెలుకువలను రైతులకు సూ చిం చారు. పశుగ్రాసాలు, ఉత్పత్తులు, డైరీ బై ప్రొడక్ట్స్ గురించి డాక్టర్ శ్రావణ్ సూ చనలు సలహాలు అందించారు. కార్యక్రమంలో కందుకూరు పశువైద్యురాలు డాక్టర్. రేవతి, డా.సంధ్యా, డా.షాహిన్‌షేక్, సిబ్బంది వసంత,జంగయ్య, మాధవి, అప్సర్, ఆరిఫ్, రమేష్, గ్రామ మాజీ సర్పంచ్ పర్వతాలు, పాడి పశువుల రైతుల పాల్గొన్నారు.

## గృహ నివాసాలపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలి





కందుకూరు, మేజర్ న్యూస్ ( నవంబర్ 13): కందుకూరు మండల కేంద్రం కొత్తగూడ గేట్ సామ సంతోషమ్మ ఫంక్షన్ హాల్ సమీపంలో ఉన్న గృహనివాసాలపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలని కాలని వాసుడు మట్ట పవన్ కళ్యాణ్ కోరారు. బుధవారం ఆయన మేజర్‌న్యూస్‌తో తెలుపుతూ... శ్రీశైలం రహదారి పక్కన ఉన్న నివాసాలపై విద్యుత్ వైర్లు ఉండడంతో బిక్కుబిక్కుమనుకుంటూ ఉంటున్నామని, భవనంపై ఎక్కాలంటే అర చేతిలో ప్రాణాలు పెట్టుకుని ఉండాల్సిందే అని ఆందోళన చెందాడు. కందుకూరు విద్యుత్ అధికారులకు ఎన్నిమార్లు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదని వాపోయాడు. ఇకనైనా విద్యుత్ అధికారులు స్పందించి గృహ నివాసాలపై వైర్లు తొలగించాలని కోరారు.

## జిల్లా దిశా కమిటీ మెంబర్ శ్రీనివాస్‌ని సన్మానించిన రావిరాల యువజన సంఘాలు



మహేశ్వరం, మేజర్ న్యూస్ (నవంబరు 13): తుక్కుగూడ మున్సిపాలిటీ రావిరాలలో సూర్యగిరి ఎల్లమ్మ ,యాదవ సంఘం అధ్యక్షులు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్ నేతాజీ యువజన సంఘం అధ్యక్షులు నక్క శ్రీశైలం యాదవ్ ల ఆధ్వర్యంలో ★రంగారెడ్డి జిల్లా దిశా కమిటీ మెంబర్ గా నియమితులైన అంబోజి శ్రీనివాస్ ని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల శ్రీశైలం యాదవ్, ఈటమోని కొమురయ్య యాదవ్, దూదిమెట్ల మల్లేష్ యాదవ్, అంబోజి శ్రీధర్ యాదవ్, సలేకుల శ్రీనివాస్ యాదవ్, అంబోజి నరేందర్, ఆంజనేయులు, ఎన్.శ్రీకాంత్, ఎన్.మహేష్, యు.నాగరాజు, ఎస్.నాగరాజు, ఎన్.శివకుమార్, ఎస్.సాయి కిరణ్, ఎస్.శ్రీకాంత్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

బాలాపూర్ మేజర్ న్యూస్( నవంబర్ 13): నేడు విద్యుత్ సరఫరా మెయింటెన్స్ చెట్ల కొమ్మలు కొట్టివేయడం కారణంగా లెనిన్ నగర్ సెక్షన్ లో విద్యుత్ సరఫరాకు ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందినీ ఏ ఈ పేర్కొన్నారు. అందుకు వినియోగదారులు తమకు సహకరించాలని లెనిన్ నగర్ ఏఈ/ఓపి ఒక ప్రకటనలో తెలిపారు. రామిడి హిల్స్, విశాఖ నగర్, విఆర్ఆర్ కాలనీ, సీఎంఆర్ కాలనీ, రాజీవ్ గృహకల్ప, సి వై ఆర్ కాలనీ, మారుతి నగర్, చంద్ర విహార్ కాలనీ వసంత విహార్ కాలనీలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# విద్యార్థులు క్రీడలతో పాటు విద్యాలోనూ ముందు ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

**మొదటిపేజీ తరువాయి...** ఈ సందర్భంగా కలెక్టర్ క్రీడాకారులతో మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో ముందుండాలని, క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా బలపడతారని అన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులు గెలుపొంది జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలాన్నారు. క్రీడల్లో తమ నైపుణ్యాన్ని పెంపొందిం చుకోవాలని ఆయన సూచించారు. క్రీడల్లో రాణించినట్లయితే ఉద్యోగల్లో ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకేర్ ప్రసాద్, సాంఘిక సంక్షేమ గురుకుల బాలల పాఠశాల/కళాశాల కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల సాంఘిక సంక్షేమ గురుకుల బాలల పాఠశాలల విద్యార్థులు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గ్రూప్-3 పరీక్షలకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

● జిల్లా అదనపు కలెక్టర్ సుదీర్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (నవంబర్ 13)ః నవంబర్ 17,18న నిర్వహించే గ్రూప్-3 పరీక్షకు సంబంధించి కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ సుదీర్ తెలిపారు. జిల్లాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-3 పరీక్షలకు 10196 మంది అభ్యర్థులు హాజరు అవుతున్నట్లు ఇట్టి పరీక్షలను 31 కేంద్రాల్లో నిర్వహిస్తు న్నట్లు ఆయన తెలిపారు. ఏవైనా సమస్యలు, సందేహాలు ఉంటే నవంబర్ 14 నుండి 18 వరకు ఉదయం 8 నుండి రాత్రి 10 గంటల వరకు 08416235291 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు.

## లగచర్లలో పోలీస్‌ల లాఠీ జులుంతో
# అరణ్య రోదనలో రైతులు

● అక్రమ అరెస్ట్‌లు ఆపండి
● బీజేపీ రాష్ట్ర నేత రమేష్ కుమార్ వెల్లడి



అరెస్ట్ ఐన బీజేపీ నేతలు

తాండూరు మేజర్ న్యూస్ (నవంబర్ 13)ః వికారాబాద్ జిల్లా కొడంగల్ సెగ్మెంట్ దుద్యాల మండలం లోని లగ చెర్ల లో లాఠీ జులుం తో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని బీజేపీ పార్టీకి చెందిన నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు బీజేపీ పార్టీకి చెందిన రాష్ట్ర కార్య వర్గ సభ్యులైన తాండూరుకు చెందిన రమేష్ కుమార్ బుధవా రం నాడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులను పరామర్శించడానికి వెళ్లిన ఎంపి డికే. అరుణను పోలీస్‌లు అడ్డుకున్నరని పేర్కొన్నారు. బీజేపీ నేతలతో కలిసి పరామర్శించడానికి వెళ్ళితే బొంరాస్ పేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారని అన్నా రు. రైతులపై అక్రమ కేసులు పెట్టవద్దు అని అన్నారు రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడావాల్సిన బాధ్యత సీఎం పైన ఉన్నది అని అన్నారు. పోలీస్ లు అరెస్ట్ చేసిన వారిలో కొడంగల్ ఇంచార్జి బంటు రమేష్, తాండూరు నేతలు సాహు శ్రీలత, బద్రు, బాబయ్య, నర్సిములు, రాములు సాగర్, తదితరులు ఉన్నారు.

# వికారాబాద్‌లో టెన్షన్.. టెన్షన్



మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డిని కోడంగల్‌కు కోర్టుకు తరలిస్తున్న పోలీస్‌లు

**మొదటిపేజీ తరువాయి...**

ముఖ్యమంత్రి నియోజక వర్గంలో అధికారుల పై దాడి జరగటం భాదకరమని ,సిఎం రేవంత్ రెడ్డిని బద్నాం చేసేందుకు బిఆర్ ఎస్ నాయకులు కుట్రలు చేయడం జరిగిందన్నారు.కొడంగల్ ను అభివృద్ధి చేద్దామని ముఖ్యమంత్రి భావిస్తుంటే దానిని అడ్డుకునే పనిలో ప్రతిపక్షం వారు పడ్డారన్నారు. పార్మ పెట్టీ స్థానికులకు ఉద్యోగాలు కల్పించే దానిని బి ఆర్ ఎస్ జీర్ణించుకోవడం లేదన్నారు.దాడి చేసిన వారిలో ఎవ్వరూ ఉన్న వదిలేది లేదని చట్టం తన పని తాను చేసుకుంటూ వెళ్తుందన్నారు.

**మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి 14 రోజులు రిమాండ్**

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని పోలీసులు హైదారాబాద్ లోని వారి నివాసం వద్ద అరెస్టు చేశారు.అనంతరం వారిని వికారాబాద్ జిల్లా లోని డిటిసి కి తరలించారు.అక్కడ అధికారుల దాడిలో ఉన్న వారికి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ప్రోత్సహించడనీ,నరేందర్ రెడ్డిని విచారించారు. ఈ విచారణ చేసేందుకు జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి,ఐజి సత్యనారాయణ పాల్గొన్నారు.దాదాపు విచారణ 4గంటల వరకు పట్టింది. విచారణ అనంతరం పరిగికి తరలించారు.

**కలెక్టర్‌ను పరామర్శించిన ఎంపి డి.కె అరుణ**

వికారాబాద్ జిల్లాలో లగ చర్లలో అధికారుల పై జరిగిన ఘటన తెలుసుకున్న మహబూబ్ నగర్ ఎంపి డి.కె అరుణ వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ను కలిసి దాడి జరిగిన దానిపై విచారం వ్యక్తం చేశారు.అనంతరం మీడియాతో డి.కె అరుణ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నియోజక వర్గంలో జిల్లా కలెక్టర్ పై దాడి జరిగే స్థాయికి ప్రజా పాలన కొనసాగుతుందని ఆరోపించారు. దాడి చేసిన వారిని,కుట్రలు పన్నినా వారిని విడిచి పెట్టవాడని,దానితో పాటు సామాన్య రైతులకు ఇబ్బందులు కల్గిస్తే ఊరుకునేది లేదన్నారు. రైతులతో ముఖ్యమంత్రి సంప్రదింపులు జరిపి రైతులను ఒప్పించి ఉంటే ఈ ఘటన జరిగేది కాదన్నారు.ఈ ఘటనకు పూర్తి భాధ్యత ముఖ్యమంత్రి వహించాల ని, ఆయనే కారణమని ఆరోపిం చారు. పంట పొలాలకు ఇబ్బందులు కలుగకు ండా,ప్రభుత్వ భూముల్లో నెలకొల్పే కంపెనీలను ఆహ్వానించా లని ఆమె కోరారు.



**సీఎం రేవంత్ రెడ్డి తీరు మార్చుకోవాలిః బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఆనంద్**



మీడియాతో మాట్లాడుతున్న తిరుపతి రెడ్డి

తమ భూములను ఇవ్వమని గత కొన్ని రోజుల నుండి వేడుకుంటున్న రైతుల పొట్టను సీఎం రేవంత్ రెడ్డి కొడుతున్నాడని మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. గత 10 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ హాయంలో ఇలాంటి ఘటన ఎక్కడైనా జరిగిందా.. అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ చేతగాని పాలనతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి లగచర్ల రైతులతో ఒక్కసారి కూడా మాట్లాడిన పాప పోలేదని అన్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖడిస్తున్నామన్నారు.

# గ్రూప్-3 పరీక్షకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి ● ధాన్యం సేకరణ, ఇంటింటి సర్వే పురోగతిపై సమీక్ష ● వీసీలో పాల్గొన్న కలెక్టర్, తదితరులు






వికారాబాద్ జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ (నవంబర్ 13) : తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఈ నెల 17, 18వ తేదీలలో జరుగనున్న గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి సూచించారు. రాష్ట్ర డీజీపీ జితేందర్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం.మహేందర్ రెడ్డి, ఇతర రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి సీ.ఎస్ శాంతికుమారి బుధవారం సాయంత్రం ఆయా జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. గ్రూప్-3 పరీక్షల సన్నద్ధతతో పాటు వరి ధాన్యం సేకరణ, పత్తి కొనుగోళ్లు, ఇంటింటి కుటుంబ సర్వే తదితర అంశాల పురోగతిపై ఆయా జిల్లాల వారీగా సమీక్షించారు. నవంబర్ 17న ఉదయం 10.00 గంటల నుండి మధ్యాన్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండ్ సెషన్ పరీక్షలు జరుగుతాయని, ఆ మరుసటి రోజైన 18వ తేదీన మధ్యాహ్నం సెషన్ లో పరీక్ష ఉంటుందని వివరించారు. బయో మెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. ఉదయం పరీక్షకు సంబంధించి 9.30 గంటల వరకే పరీక్షా కేంద్రం లోనికి వెళ్లేందుకు అనుమతించడం జరుగుతుందని, అనంతరం గేట్లు మూసివేయాలని, మధ్యాహ్నం పరీక్షకు సంబంధించి 2.30 తరువాత ఎవరినీ లోనికి అనుమతించకూడదని స్పష్టం చేశారు. చీఫ్ సూపరింటెండెంట్ కు తప్ప మరెవ్వరికి పరీక్షా కేంద్రం లోపలికి మొబైల్ ఫోన్ అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రం లోకి మొబైల్ ఫోన్, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తీసుకువెళ్లేందుకు అనుమతి లేదని, ఈ మేరకు ప్రతి కేంద్రం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, సజావుగా జరిపించాలని చైర్మన్ సూచించారు. ప్రశ్నపత్రాల లీకేజీలు, మాల్ ప్రాక్టీస్ వంటి వాటికి ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రశ్న పత్రాలు, ఇతర పరీక్షా సామాగ్రిని పోలీసు బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్ నుండి ఎగ్జామినేషన్ సెంటర్స్ కు తరలించాలన్నారు. పరీక్షా కేంద్రం లోనికి ఇతరులు ఎవరిని అనుమతించకూడదని, పరీక్షా సమయం ప్రారంభం నుండి ముగిసేంత వరకు పరీక్ష కేంద్రం నుండి అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లు కూడా బయటకు వెళ్లకూడదని చైర్మన్ స్పష్టం చేశారు. ఎలాంటి పొరపాట్లు, ఆరోపణలకు తావులేకుండా పకడ్బం దీగా పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. దివ్యంగులైన అభ్యర్థులు తమకు బదులుగా ఇతరులచే పరీక్ష రాసేందుకు అనుమతి కోరిన చోట, అలాంటివారు ఇంటర్మీడియట్ కంటే తక్కువ విద్యార్హత కలిగిన వారితోనే పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని, తమవెంట వైకల్యం ధృవీకరించే సర్టిఫికెట్ తేవాలని స్పష్టం చేశారు. ఈసారి కొత్తగా అమలులోకి వచ్చిన నిబంధనను అనుసరిస్తూ స్క్రైబ్ లను పరీక్షకు 24 గంటల ముందు దివ్యంగులైన అభ్యర్థులతో పరిచయం చేయించాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే అభ్యర్థులంతా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడిపించాలని, ప్రతి పరీక్షా కేంద్రంలోనూ డ్యూయల్ డెస్క్ టేబుళ్లు, తగినంత వెలుతురు, సరిపడా లైటింగ్, తాగునీరు, టాయిలెట్ ఇత్యాది వసతులు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసిఉంచేలా చర్యలు చేపట్టాలని, అన్ని కేంద్రాల వద్ద మహిళా పోలీసు సిబ్బందిని సైతం నియమించాలని అన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ఉమహారతి,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్యాకేజీలు ఇచ్చిమరీ ప్రభుత్వాన్ని తిట్టిస్తున్నారు




- తెలంగాణలో బీఆర్ఎస్ కుట్రపూరిత రాజకీయం
- కాంగ్రెస్ కార్యకర్తలు కన్నెర్రజేస్తే తట్టుకోలేరు
- కలెక్టర్‌పై దాడి వెనక బీఆర్ఎస్ నాయకుల కుట్ర
- బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ నాయకుల ఫైర్

షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (నవంబరు 13): అధికారం కోల్పోయి పది నెలలు కూడా కాలేదు అప్పుడే బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్రంలో కుట్రపూరిత రాజకీయాలకు తెరలేపిందని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ లగచర్లలో కలెక్టర్, అధికారులపై దాడి జరగడం అంతా ఒక ప్రణాళికా బద్ధంగా జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి కనుసన్నల్లోనే సురేష్ అధికారులను గ్రామానికి తీసుకువచ్చి దాడికి పాల్పడ్డాడని అన్నారు. మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి కేటీఆర్ డైరెక్షన్‌లో పనిచేస్తూ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేఖత తెచ్చే విధంగా బీఆర్ఎస్ గూండాలతో అధికారులపై దాడులు చేయించారని విమర్శించారు. గత పదేళ్ల కాలంలో కాంగ్రెస్ నాయకులు నిరసనలు, ధర్నాలు చేపట్టారే కానీ ఏనాడు ఎవరిపై రౌడీయిజం చేయలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పనుల్లో భాగంగా ఫార్మా కంపెనీలు, మూసీ ప్రక్షాళన, ప్రాజెక్టుల నిర్మాణం వంటి ఏపని చేపట్టినా బీఆర్ఎస్ వాటిని అడ్డుకునేందుకు తప్పుడు దారులు తొక్కుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని సంస్కృతిని బీఆర్ఎస్ తెలంగాణలో తెచ్చిందన్నారు. ఢిల్లీలో ఉంటూ ఓ పక్క బీజేపీని తిడుతూనే మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రకటిస్తున్న కేటీఆర్ వ్యవహారం అందరూ గమనిస్తూనే ఉన్నారన్నారు. మహబూబ్‌నగర్ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, అతని తమ్ముడు శ్రీకాంత్ గౌడ్ చేయని అరాచకాలు లేవని, వారు కూడా ముఖ్యమంత్రి గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ ముఠా నాయకులైన శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డిలు ఒక దగ్గర కలిసినప్పుడే ఏదో పెద్ద స్కెచ్ వేయబోతున్నారని అనుకున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి గురించి షాబాద్‌లో, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి గురించి అతని సొంత గ్రామంలో, శ్రీనివాస్ గౌడ్ గురించి మహబూబ్‌నగర్‌లో వాకబు చేస్తే వారి దౌర్జన్యం అందరికీ తెలిసిందేనని అన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కుట్రలు చేసి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారన్నారు. పదేళ్లలో చేయలేని అభివృద్ధిని పది నెలల్లో ప్రారంభించామని, బీఆర్ఎస్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేసి దోచుకున్నారన్నారు. ఐఏఎస్ అధికారులపై బీఆర్ఎస్ గూండాల దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఇదే విధంగా చేస్తే గ్రామాల్లో వారిని తిరగనివ్వమని హెచ్చరించారు. షాద్‌నగర్ సదర్ కార్యక్రమంలో కూడా బీఆర్ఎస్ నాయకులు ఓ పథకం ప్రకారం కొంతమంది యువకులను రెచ్చగొట్టి ఘర్షణ వాతావరణం సృష్టించారన్నారు. బీఆర్ఎస్ గూండాలు పద్ధతి మార్చుకోకపోతే కాంగ్రెస్ కార్యకర్తలు కన్నెర్రజేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఘు నాయక్, మహ్మద్ అలీఖాన్ బాబర్, చెంది తిరుపతి రెడ్డి, కృష్ణారెడ్డి, పురుషోత్తం రెడ్డి, చల్లా శ్రీకాంత్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, ఇబ్రహీం, సయ్యద్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అభివృద్ధికి ఆటకం కలిగించవద్దు

★జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి



కందుకూరు, మేజర్‌న్యూస్ ( నవంబర్ 13): ద్వందనీతితో స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం అభివృద్ధికి ఆటంకం కలిగించవద్దని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్, మహేశ్వరం నియోజకవర్గం మీడియా కోఆర్డినేటర్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. బుధవారం ఆయన పత్రిక ప్రకటనలో తెలుపుతూ... వ్యక్తిగత స్వార్ధ రాజకీయాలకోసం బీఆర్ఎస్ నాయకులు ప్రజలను రెచ్చగొట్టి అభివృద్ధికి ఆటంకం కలిగించి ఈ ప్రాంతం అభివృద్ధిని అడ్డుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి చూస్తున్నారని ఇక ఆటలు కొనసాగవని పాండురంగారెడ్డి అన్నారు. సబితారెడ్డి మంత్రిగా కొనసాగిన సమయంలో వేలాది ఎకరాల రైతులు, ప్రభుత్వం భూములను వారి అభీష్టానికి వ్యతిరేకంగా సేకరించి నేడు సంపిన వారే సంతాప సభ పెట్టినట్లు సభలు పెట్టి రైతుల మెదల్లో విషాన్ని నింపడం ఎంతవరకు సమంజసమో గ్రహించాలని కప్పాటి హితవు పలికారు. నేడు ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా ఫ్యూచర్ సిటీని నిర్మించాలనే తలంపుతో సీఎం రేవంత్‌రెడ్డి భవిష్యత్ అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని రోడ్డు నిర్మాణం చేపడుతుంటే కుటిల బుద్ధితో అడ్డుకుని రైతులను రెచ్చగొట్టడం ఎంతవరకు సమంజసమో రైతులే గ్రహించాలని కోరారు. మెడమీద తల లేనోడు ముచ్చర్ల ఫార్మాసిటీ నిర్మిస్తారా అని రైతులను రెచ్చగొట్టి అధికార పార్టీలో చేరి మంత్రి పదవి పొంది అదే రైతుల వద్ద అతి తక్కువ ధరకు బలవంతంగా భూమలు సేకరించి తక్కువ నష్టపరిహారం అందించిన మాట నిజం కాదా అని ప్రశ్నించారు. సెజ్‌ల పేరుతో వేలాది ఎకరాలు ప్రైవేట్ సంస్థలకు దారా దత్తం చేసింది మీరు కారా..? మాస్టర్ ప్లాన్‌లో కొంగర నుండి నిర్మాణం చేయాలన్నది నిజం కాదా అన్నారు. సంవత్సరాలు గడిచిన నష్ట పరిహారం ఇవ్వకుండా అధికారంలో కొనసాగింది మీరు కారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో అవినీతి అరాచకం దోపిడి చేస్తే నేడు కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన ద్వారా అభివృద్ధి చేస్తుందని అన్నారు. రేవంత్‌రెడ్డి అభివృద్ధి నిర్మాణాలు చేస్తే బీఆర్ఎస్ ప్రజలను రెచగొట్టి అరాచకాలు చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధికి ఆటకం కలిగిస్తే ప్రజల్లో తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ప్రజల్లో ప్రభుత్వంపై అపోహలను కలిగించి రెచ్చగొట్టడం సమాజానికి మంచిది కాదని కప్పాటి ఉద్ఘాటించారు.

## అధికారులపై దాడిలో బిఆర్ఎస్ హస్తం : కెఎల్ఆర్



మహేశ్వరం, మేజర్ న్యూస్ (నవంబరు 13): వికారాబాద్ కలెక్టర్ సహా ఇతర అధికారులపై దాడిలో బీఆర్ఎస్ నేతల హస్తం ఉందని ఆరోపించారు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. నాయకులు అధికారం కోల్పోయమన్న భ్రమలో మతిభ్రమించి అధికారులు, కాంగ్రెస్ నాయకులపై దాడి చేస్తున్నారని మండి పడ్డారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండి అరాచాకలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు రాజరిక పాలన, దొరల గడీల పాలనను సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో బద్దలు కొట్టామన్నారు లక్ష్మారెడ్డి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులకు ప్రజలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి నిందితుడు 42 సార్లు ఫోన్ చేసినట్లు అధికారులు గుర్తించారు. కాల్ డేటా ఆధారంగా నిందితులను అరెస్టు చేస్తున్నట్లు తెలిపారు. సంఘ విద్రోహ శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి. ఈ రేస్ స్కామ్ నుంచి తప్పించుకునేందుకే మాజీమంత్రి కేటీఆర్ ఢిల్లీలో తిరుగుతున్నారని... బీఆర్ఎస్ బీజేపీ చీకటి ఒప్పందాలు ఇప్పుడు వెలుగు చూస్తున్నాయని కేఎల్ఆర్ విమర్శించారు.

## కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోలేక అధికారులపై దాడులు

★కలెక్టర్ పై దాడిని ఖండించిన మామిడిపల్లి కాంగ్రెస్ నాయకులు లాల్ సతీష్ గౌడ్



జల్ పల్లి, మేజర్ న్యూస్ (నవంబర్ 13):కాంగ్రెస్ పార్టీని ఎదురుకోలేకనే కేటీఆర్, హరీష్ రావులు తమ కార్యకర్తలతో అధికారులపై దాడులు నిర్వహిస్తున్నారనిమామిడి పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లాల్ సతీష్ గౌడ్, కళ్లెం నరేష్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. సీఎంరేవంత్ రెడ్డి తన సొంత నియోజకవర్గం కొడంగల్ ను అన్ని నియోజకవర్గాలకు దీటుగా అభివృద్ధి చేసే దిశగా పరిశ్రమలను ఏర్పాటు చేసి,స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో కాలుష్య రహిత ఫార్మాసిటీ ఎర్పాటు కోసం రైతుల అభిప్రాయ సేకరణకువెళ్లిన కలెక్టర్, అధికారులపై జరిగిన దాడికి సమర్దించేలా బీఅర్ఎస్ అగ్రనాయకులు కేటీఆర్, హరీశ్ రావులు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కొడంగల్ రైతులను పచ్చటి పొలాల నుండి వెళ్లగొడుతున్నారంటూ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లోని పదిహేను వేల ఎకరాల రైతుల భూమిని బలవంతంగా సేకరించ లేదా అని ప్రశ్నించారు. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం రైతుల పట్ల ఎందుకు ఇంత వివక్ష అని తెలిపారు. ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి, రైతులను రెచ్చగొట్టి రాజకీయంగా ఉపయోగించుకోవడానికి కేటీఆర్, హరీశ్ రావుల కుట్రలు ఫలించవని హితువు పలికారు. అభివృద్ధికి ప్రజలకు సహకరించాలని వారు కోరారు.

## శెనిగలగుట్ట తాండ బీటీరోడ్డుకు నక్షా ప్రకారమే బౌండరీ ఫిక్స్ చేయాలి

ఎమ్మెల్యే కసిరెడ్డికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు రఘునాయక్ వినతి



మాడ్గుల, మేజర్ న్యూస్ ( నవంబర్ 13): మాడ్గుల మండలం కలకొండ గ్రామపంచాయతీ పరిధిలోని గిరిజన తాండాలైన శెనిగల గుట్ట తాండ, సీతారాం తాండలకు గత ప్రభుత్వ హాయాంలో ఎస్ టి ఎస్ డిఎఫ్ నిధుల ద్వారా బిటి రోడ్డు మంజూరై సంవత్సర కాలం గడిచిపోయిందని ,అయినప్పటికి నేటికి బిటి నిర్మాణం ప్రారంభం కానందున సత్వరమే సంబంధితశాఖల అధికారులతో మాట్లాడి బిటి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు చేపటాలను కోరుతూ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాత్లావత్ రఘు నాయక్ బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి విన్నపించారు. ఈమేరకు తాండ నాయకులతో కలిసి హైదరాబాదులోని ఎమ్మెల్యే నివాసంలో కసిరెడ్డి నీ కలిసి వినతి పత్రం అందజేసినట్లు రాత్లావత్ రఘు నాయక్ తెలిపారు. తమ వినతిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి శనిగెల గుట్ట తండా, గోప్యతండా బీటీ రోడ్లను సత్వరమే ప్రారంభించేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు రఘునాయక్ తెలిపారు. ఈ సందర్భంగా నక్ష ప్రకారమే శనిగెలగుట్ట తాండ బిటిరోడ్డుకు హద్దులు నిర్ణయించాలని గతంలో ఇద్దరు తహసీల్దార్లకు తాము విన్నపించినా ఫలితం లేకపోయిందని, ఈ విషయాన్ని ఆర్డీఓ, తహసీల్దార్ లతో మాట్లాడి నిగ్గ తేల్చాలని ఎమ్మెల్యే గారికి వివరించగా నక్షా ప్రకారమే బిటిరోడ్డు నిర్మించేలా జిల్లా కలెక్టక్టర్ తో మాట్లాడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు రఘునాయక్ వివరించారు. వినతిపత్రం అందజేసినవారిలో తాండనాయకులు రాత్లావత్ భీమ్లాల్ ,రామ్ చందర్, రవి ,బిక్షపతి ,లోక నాయక్ తదితరులు ఉన్నట్లు రఘునాయక్ చెప్పారు.

## రైతులు పాడిపశువులపై జాగ్రత్తలు తీసుకోవాలి

–పశువైద్యాధికారి డా.వి.శిరీష



చేవెళ్ల, మేజర్‌న్యూస్ (నవంబర్ 13)ః రైతులు పాడిపశువులపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి డా.వి.శిరీష తెలిపారు. మండల పరిధిలోని పామెన గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పాడిపశువులకు ఉచిత గర్భకోశ చికిత్స నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.... పశువుల గర్భకోశ వ్యాదుల పట్ల పాడి రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆవులు, గేదెలు గర్భం దాల్చినప్పుడు వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. చలికాలంలో పాడిపశువుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పశువులకు నట్టల నివారణ మందులు, చూడి పరీక్షలు, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, గర్భకోశ నివారణ చికిత్సలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ పశుగణాభివృద్ది సంస్థ డాక్టర్ జయసుద, పశువైద్య సిబ్బంది, రైతులు ఉన్నారు.

## శ్రీశ్రీశ్రీ ఆదిత్య పర శ్రీ స్వామిని సన్మానించిన బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్



గండిపేట్, మేజర్‌న్యూస్ (నవ ంబర్ 13) : శ్రీశ్రీశ్రీ ఆదిత్య పర శ్రీ స్వామి బండ్లగూడ జాగీర్ మాజీ సర్పంచ్ గంగని హరికృష్ణ నివాసానికి రావడంతో ఆయనను పలువురు ప్రముఖులు కలిసి సన్మానించారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మెన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం స్వామివారు ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు డప్పు నవీన్‌కుమార్, శంషాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం శేఖర్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, బొక్క అనంతరెడ్డి, గంగని రాజు, గంగని మహేందర్, రెడ్డిగాళ్ల రత్నం, గుండాడ శేఖర్, గుండాడ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేగు బంధాన్ని కలిపిన దాదాపూర్ యువకులు



దోమ, మేజర్‌న్యూస్ (నవంబర్ 13)ః మతిస్థిమితం లేని తప్పిపోయి వచ్చిన వ్యక్తి యొక్క సమాచారాన్ని మానవతా దృక్పథంతో కష్టపడి తెలుసుకొని చందాలు వేసుకొని మరి వారి తల్లిదండ్రులకు అప్పజెప్పిన సంఘటన దాదాపూర్ గ్రామంలో జరిగింది. వివరాలలోకి చతిస్గడ్ రాష్ట్రానికి చెందిన మంగేష్కర్ ఠాకూర్ అనే వ్యక్తి మానసిక రుక్మతతో బాధపడి గత 9 నెల క్రితం తమిళనాడు రాష్ట్రంలో కోయంబత్తూర్ నగరంలో ఒక ఉత్సవంలో కుటుంబంతో పాటు వచ్చి తప్పిపోయినాడు అప్పటినుండి తిరిగి వెళ్లలేని పరిస్థితులలో తిరుగుతూ తిరుగుతూ నిన్న రాత్రి దోమ మండలపరిధిలో ని దాదాపూర్ గ్రామానికి వచ్చినారు. అనుమాదాస్పదంగా తిరుగుతున్న అట్టి వ్యక్తిని దాదాపూర్ గ్రామ యువకులు ప్రశ్నించి వివరాలు సేకరించే ప్రయత్నం చేసినప్పటికీ కేవలం రాష్ట్రం ఊరు పేరు చెప్పడంతో యువకులు శ్రమించి అట్టి రాష్ట్రానికి సంబంధించిన అనేక వ్యక్తులతో మాట్లాడి అడ్రస్ తెలుసుకోవడానికి ప్రయత్నం చేసినారు చివరగా ఒక ట్రావెల్ ఏజెన్సీ వ్యక్తి కారణంగా తప్పిపోయిన వ్యక్తి అడ్రస్ మరియు వారికి సంబంధించిన కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్ ను తెలుసుకొని కారు మాట్లాడుకుని చతిస్గడ్ లోని దుర్గ్ జిల్లా డీఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న తప్పిపోయిన వ్యక్తి యొక్క అన్న విశాల్ ఠాకూర్ జిల్లా పోలీస్ అధికారి ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పజెప్పినారు. 9 నెలల తర్వాత క్షేమంగా చేరిన తన సోదరుడు తల్లిదండ్రుల ఆనందోత్సవాలలో దాదాపూర్ గ్రామ యువకులు పాలుపంచుకొని, డీఎస్పీ కార్యాలయంలో వారిచే సన్మానింపబడి రూ. 10000 పారితోషకం తీసుకొని తిరుగు ప్రయాణంలో సంతోషంతో బుధవారం రోజు ఉదయం 10 గంటలకు దాదాపూర్ గ్రామానికి చేరుకున్నారు.

## ప్రథమ్ స్కిల్స్ డెవలప్మెంట్ సెంటర్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

- జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (నవంబర్ 13)ః ప్రథమ్ స్కిల్స్ డెవలప్మెంట్ సెంటర్, హైదరాబాద్ నందు శిక్షణ తరగతుల కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ ఒక ప్రకటన తెలిపారు. జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయము, ఐటిఐ క్యాంపస్ వికారాబాదు నందు నవంబర్ 16 శనివారం ఉదయము 10:30 గంటలకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రథమ్ స్కిల్స్ డెవలప్మెంట్ సెంటర్ లో సుమారు 200 మంది కి డిజిటల్ / తరగతి గది శిక్షణ అనుభవజ్ఞులైన నిపుణులచే శిక్షణ, శిక్షణ పొందిన వెంటనే ఉద్యోగావకాశాలు ఉన్నాయని వీటికి వయస్సు18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల అందరు అర్హులని తెలిపారు. ఇట్టి శిక్షణ తరగతులకు పదవ తరగతి, ఇంటర్ డిగ్రీ, ఐ.టి.ఐ.విద్యా అర్హత కలిగి ఉండాలని అన్నారు. ఎలక్ట్రికల్ /సోలార్/ డాటా ఎంట్రీ ఆపరేటర్/ నర్సింగ్ శిక్షణ తరగతులు 45 రోజులు హైదరాబాదులో నిర్వహించడం జరిగింది. ఈ జాబ్ మేళ ద్వారా ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఇట్టి అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఇతర వివరములకు జాబ్ మేళా నిర్వాహకుడు మియా సాబ్ 9676047444 ద్వారా సంప్రదించవచ్చునని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

# గ్రామాలలో పారిశుద్ధ్యం,తాగునీటి సరఫరాపై ప్రాధాన్యత ఇవ్వాలి

- గ్రామానికి 10వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా పని చేయాలి
- ఉపాధి హామీ పనులపై ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం
- కుల్కచర్ల ఎంపిడిఓ రామకృష్ణ నాయక్, ఎంపిఓ భాస్కర్ గౌడ్

కుల్కచర్ల రూరల్, మేజర్ న్యూస్ (నవంబర్ 13)ః కుల్కచర్ల, చౌడపూర్ మండలాల్లోని ప్రతి గ్రామ పంచాయతీలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను పదివేల మొక్కలు నాటడమే లక్ష్యంగా ఫీల్డ్ అసిస్టెంట్లు,పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలని కుల్కచర్ల ఎంపిడిఓ రామకృష్ణ నాయక్ అన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి భాస్కర్ గౌడ్, ఇంచార్జీ ఎపిఓ చంద్రశేఖర్ లతో కలిసి ఉమ్మడి కుల్కచర్ల మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టనున్న పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనులు, డంపింగ్ యార్డ్, క్రిమిటోరియం, నర్సరీ



సమావేశంలో మాట్లాడుతున్న మండల అధికారులు

పనులపై పలు సూచనలు సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు,ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన మండల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు

## కేజీబీవీని ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపిఓ భాస్కర్ గౌడ్



మౌలిక సదుపాయాలను పరిశీలిస్తున్న పంచాయతీ అధికారి భాస్కర్ గౌడ్

కుల్కచర్ల రూరల్,మేజర్ న్యూస్ (నవంబర్ 13)ః కుల్కచర్ల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని బుదవారం కుల్కచర్ల మండల పంచాయితీ అధికారి భాస్కర్ గౌడ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోనే మౌలిక వసతులను పరిశీలించి పాఠశాలలో పలు రికార్డులను పరిశీలించారు. పది మరియు ఇంటర్మీడియట్‌లో మంచి ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. అనంతరం పాఠశాలలో భోజన సదుపాయాన్ని పరిశీలించి సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారిని దేవి కిషన్, ఉపాధ్యా బృందం పాల్గొన్నారు.

# వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం.

దోమ, మేజర్‌న్యూస్ (నవంబర్ 13)ః దోమ మండల పరిధిలోని గుండాల గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో వరిగొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన దోమ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాలి విజయకుమార్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కష్టపడి పండించిన పంటను దళారులను నమ్మి, అమ్మి మోసపోవద్దని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుంది అన్నారు. వరి ధాన్యం క్వింటాలుకు ఏ గ్రేడ్ రకానికి రూ.2320, బి గ్రేడ్ వరి ధాన్యానికి రూ.2300 మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు పండించిన తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు.ఈ కార్యక్రమంలో దోమ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు పట్లోళ్ల ప్రభాకర్ రెడ్డి, బంగ్లా యాదయ్య గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు రామచంద్రారెడ్డి మల్ రెడ్డి, శ్రీను,రఘునాథ్ రెడ్డి,పుట్టి రాములు ,మాణిక్ రెడ్డి, జగన్నాథ్ రెడ్డి, రాజపాల్ రెడ్డి, అయిల్ రెడ్డి, మాల వెంకట్య, మాల శ్రీను, మాల అంజిలప్ప, చింతకింది దస్తయ్య, జె గోపాల్ రెడ్డి, నార్య నాయక్ రైతులు తదితరులు పాలుగోన్నారు.

## తప్పులు దొరకకుండా సమగ్ర కుటుంబ సర్వే చేపట్టాలి

- నవాబ్ పేట్ ఎంపిడివో అనురాధ



సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

నవాబ్ పేట్ మేజర్ న్యూస్ (నవంబర్ 13)ః ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను తప్పులు లేకుండా చేపట్టాలని పర్యవేక్షకులు, ఎంపిడివో అనురాధ అన్నారు. వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలం యావపూర్ గ్రామంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యూమరేటర్‌లు సర్వే చేసే విధానాన్ని, అడిగే ప్రశ్నల తీరును, సర్వే ఫార్మ్‌లో కుటుంబాల వివరాల నమోదును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అనురాధ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ఎలాంటి తప్పులు లేకుండా కుటుంబాల వివరాలను నమోదు చేయాలన్నారు. అదే విధంగా సర్వే ప్రక్రియను వేగవంతం చేసి,నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపివో విజయ్ కుమార్, సూపర్డెంట్ అజేయ్ కుమార్, ఎన్యుమేరేటర్స్,తదితరులు పాల్గొన్నారు.

# కొడంగల్ అభివృద్ధిని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ కుట్రలు

- అధికారులపై దాడికి పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదు
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎ.తిరుపతిరెడ్డి

బొంరాస్‌పేట్ /కొడంగల్, మేజర్ న్యూస్ (నవంబరు 13): కొడంగల్ ప్రాంత అభివృద్ధిని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ కుట్ర చేస్తుందని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎ.తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన లగచర్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దుద్యాల మండలం లగచర్లలో ఇండస్ట్రీయల్ కారిడార్ భూ అభిప్రాయ సేకరణలో జిల్లా స్థాయి అధికారులపై జరిగిన దాడిని ఖండించారు. ఈ దాడులకు కుట్రదారులు, సూత్రదారులు, దాడుల్లో పాల్గొన్న ఎంతటి వారైనా వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తుంటే ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు కొందరు యువకులకు మద్యం తాగించి అధికారులపై దాడులతో కొడంగల్‌లో ఏదో జరుగుతుందని లా అండ్ ఆర్డర్ సమస్యను సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఈ సంఘటనను ప్రభుత్వం రాజకీయం చేయదలుచుకోలేదని, పోలీసుల దర్యాప్తు అనంతరం చర్యలు తప్పవన్నారు. యువతను తప్పుదోవ పట్టించి విధ్వంసం సృష్టిస్తుంటే కొడంగల్ ప్రాంత ప్రజలు ఐక్యమత్యంగా కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సిద్దిపేట, సిరిసిల్లాలో అభివృద్ధికి ధీటుగా కొడంగల్‌లో అంతకంటే ధీటుగా అభివృద్ధి చేసి ఈ ప్రాంత ప్రజలకు విద్య, ఉద్యోగ , ఉపాధి



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎ.తిరుపతి రెడ్డి

అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. అభివృద్ధిలో భాగంగా భూములు కోల్పోయే రైతులు ముందుకు వచ్చి తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయలన్నారు. పరిహారం, వసతులు కల్పించేందుకు ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న వారు రైతులేనని, అధికారులపై దాడుల్లో పాల్గొన్న వారు కేవలం కొంత మంది విధ్వంస కారులు అన్నారు. కొడంగల్ సమగ్ర అభివృద్ధి కోసం ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ ఉచ్చులతో పడకుండా ప్రజలందరూ కలిసివచ్చి సహకరించాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌లు రాజేశ్‌రెడ్డి, వార్ల విజయ్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నందారం ప్రశాంత్, నర్సిములుగౌడ్, ఆవుటి శేఖర్, పీఏసీఎస్ చైర్మన్ జయక్రిష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, నాయకులు శ్రీరామ్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, నయీమ్, రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# డిసిసిబి చైర్మన్, డైరెక్టర్లకు ముగిసిన శిక్షణ తరగతులు



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (నవంబర్ 13 )ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి చేసిన సేవలకు గుర్తింపుగా నాబార్డ్ అధికారుల నుండి డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, డైరెక్టర్లు గంప వెంకటేష్, భూపాల్ రావు, రంగారెడ్డి లు అవార్డులు అందుకున్నారునాబార్డ్ ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రం మధురై నగరంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన డిసిసిబి చైర్మన్లు, డైరెక్టర్లకు మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ పూర్తయినది. ఈ శిక్షణలో భాగంగా బుధవారం శిక్షణను పూర్తి చేసుకున్న ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, డైరెక్టర్లు గంప వెంకటేష్ గుప్తా, భూపాల్ రావు,

## – అవార్డులు అందుకున్న డిసిసిబి చైర్మన్, డైరెక్టర్లు

రంగారెడ్డి లకు జాతీయ నాబార్డు అభివృద్ధి అధికారులు భూపేందర్ సింగ్, ఉడిత్ అగర్వాల్ చేతుల మీదుగా అవార్డులు, శిక్షణకు సంబంధించిన పత్రాలను అందజేసినట్లు చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్త తెలిపారు. గత మూడు రోజులుగా నాబార్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో తమిళనాడు రాష్ట్రంలోని పుండీ, మధురై జిల్లాలకు చెందిన ప్రాథమిక సహకార సంఘాలు, డిసిసిబి బ్యాంకులు ఏ విధంగా లాభాల్లో నడుస్తున్నాయి. దానికి తీసుకోవాల్సిన ప్రణాళికలు తెలుసుకొని తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా వలసల జిల్లా అయిన పాలమూరు జిల్లాలో డీసీసీబి బ్యాంకులను ఎలా లాభాల బాటలో నడిపించే విధంగా కృషి చేస్తే బాగుంటుందనే విషయాలపై జాతీయ నాబార్డు అధికారులతో చర్చించినట్లు వారు తెలిపారు. మూడో రోజు శిక్షణలో భాగంగా సైబర్ క్రైమ్ ల నివారణ కోసం ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాలపై శిక్షణలో వివరించినట్లు వారు పేర్కొన్నారు. తాము ప్రమాణ స్వీకారం చేసిన ప్రారంభంలో నూతన పాలకవర్గం మహబూబ్నగర్ డిసిసిబిని నష్టాల్లో నుంచి లాభాల లోకి తీసుకోరావడం కోసం ఆర్బిఐ నియమ నిబంధనల ప్రకారం నెట్ బ్యాంకింగ్ సేవలు యూపీఐ, గూగుల్ పే, ఫోన్ పే లాంటి సేవలను డిసిసిబి బ్యాంకులో అందుబాటులోకి తేవడంపై ఫీడ్ బ్యాంకింగ్ సేవలకు గుర్తింపుగా జాతీయ నాబార్డ్ అధికారులు అవార్డులు అందజేసినట్లు వారు తెలిపారు.

# హైతాబాద్‌లో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



షాబాద్ మేజర్ న్యూస్ ( నవంబర్ 13 ) :షాబాద్ మండల కేంద్రంలోని హైతాబాద్ గ్రామంలో శ్రీ మహంకాళి అమ్మవారి, శ్రీ బీరప్ప స్వామి మరియు మల్లన్న స్వామి వార్ల విగ్రహాల మరియు ధ్వజస్తంభ ప్రతి ప్రతిష్టాపన కార్యక్రమం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కావలి చంద్రశేఖర్, అత్తిలి శ్రీనివాస్ రెడ్డి, సత్యం యాదవ్, సూద యాదయ్య, చర్ల సత్తయ్య, చర్ల కుమార్, వోజిని నరసింహులు, భాస్కరాచారి , మహిపాల్ రెడ్డి, కడియాల శంకర్, నాగులపల్లి ఆంజనేయులు, కందికొండ నరేష్ గౌడ్, రామకృష్ణ, సాయిలు, మల్లయ్య గౌడ్, ఆంజనేయులు, మహేష్, మహేందర్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# పుస్తకాలతో విద్యార్థులకు జ్ఞానం

## –కావ్యకృష్ణాగౌడ్ ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ



చేవెళ్ల, మేజర్‌న్యూస్ (నవంబర్ 13)ః పుస్తకాలతో విద్యార్థులకు జ్ఞానం పెరుగుతుందని కందవాడ మాజీ ఉపసర్పంచ్ కావ్యకృష్ణాగౌడ్ అన్నారు. మండల పరిధిలోని కందవాడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం జాయ్ ఆఫ్ రీడింగ్ సంస్థ సహకారంతో లైబ్రరీకి పుస్తకాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... చినిగిన చొక్క అయిన తొడుక్కో కానీ మంచి పాఠ్యా పుస్తకాన్ని కొనుక్కో అన్నా కందుకూరి వీరేశలింగం పంతులు ఆలోచనను ఆచరించి జాయ్ ఆఫ్ రీడింగ్ సంస్థ సహకారంతో రూ.30వేలతో విలువైన పాఠ్యాపుస్తకాలు అందించడం జరిగిందన్నారు. ఈ పుస్తకాలతో గ్రంథాలయాన్ని వాడుకల్లోకి తెచ్చి విద్యార్థులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతామన్నారు. విద్యార్థులకు పుస్తకాలకు దూరమై పఠనా శక్తిని కోల్పోతున్నారన్నారు. జాయ్ ఆఫ్ రీడింగ్ సంస్థ అందించిన పుస్తకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, రజినీ, దర్శన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఎన్నికల హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలి

### –సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య




చేవెళ్ల, మేజర్‌న్యూస్ (నవంబర్ 13)ః ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ శతజయంతి ఉత్సవాలను చేవెళ్లలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... చేవెళ్లలో సర్వే నెం.75లో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్ల పట్టాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అమలు చేస్తామన్న రైతు భరోసా పథకాన్ని అమలు చేసి అకౌంట్‌లో డబ్బులు వేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ప్రభులింగం, బీకెఎంయూ జిల్లా అధ్యక్షులు అంజయ్య, మండల మహిళా అధ్యక్షురాలు మంజుల, మండల సహాయ కార్యదర్శి మక్బుల్, నాయకులు కృష్ణాగౌడ్, లలిత, సత్యనారాయణ, యాదగిరి, శ్రీనివాస్, యాదయ్య తదితరులు ఉన్నారు.

# మత సామరస్యాన్ని చాటుకున్న ముస్లీం సోదరుడు



కందుకూరు, మేజర్‌న్యూస్ ( నవంబర్ 13): మత సామరస్యానికి మన దేశం ప్రతీకగా నిలుస్తోంది. ఒకరి పండుగలకు మరొక రు హ జరు అవుతుంటారు. కులమతాలకు అతీతంగా ముస్లీం సోదురుడు అయ్యప్ప స్వామిపై తమ భక్తిని చాటుకున్నాడు. మండలంలోని దెబ్బడగూడ గ్రామంలో అయ్యప్ప మాలాధారణ వేసుకున్న 56 మంది అయ్యప్ప స్వాములకు మఖాన్ గ్రామానికి చెందిన మహమద్ గౌస్ అల్పహారాన్ని ఏర్పాటు చేసి మత సామరస్యాన్ని చాటుకున్నాడు కార్యక్రమంలో దెబ్బడగూడ సన్నిదాన స్వాములు పాల్గొన్నారు.

# సర్టిఫికెట్ ఇచ్చిన వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలి



కందుకూరు, మేజర్‌న్యూస్ ( నవంబర్ 13): సర్టిఫికెట్‌లు ఇచ్చిన వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. బుధవారం పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించిన అనంతరం బాల్‌రాజ్, జంగారెడ్డి మాట్లాడుతూ... 16 సంవత్సరాల కిందట సర్టిఫికెట్స్ ఇచ్చారని, కాని ఇప్పటికి స్థలాలు చూపించలేదన్నారు.788 సర్వే నంబర్‌లో 183 మందికి సర్టిఫికెట్లు, 107 సర్వే నంబర్‌లో 350 మందికి సర్టిఫికెట్స్ ఇచ్చారని, ఎమ్మెల్యే సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్ళిన ప్రయోజనం లేకుండా పోయిందని వారు వివరించారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పేద ప్రజలకు స్థలాలు చూపించాలని కోరారు. కార్యక్రమంలో పిల్లి రవి, మహేందర్, అరుణ, చంచల, జ్యోతి, సబియా బేగం, సక్కుబాయి, మంగ ,శివ తదితరులు పాల్గొన్నారు.

## లైంగిక వేధింపుల కేసులో రూ.25వేల జరిమానా, 20ఏళ్ల జైలు శిక్ష

చేవెళ్ల, మేజర్‌న్యూస్ (నవంబర్ 13)ః మైనర్ బాలిక లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి రూ.25వేల జరిమానా, 20ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ ఫోక్సో కోర్టు జడ్జీ హరీష తీర్పును వెల్లడించినట్లు చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. పూడూర్ మండలం బాకాపూర్ గ్రామానికి చెందిన వడ్డే ప్రకాష్ 2017లో మైనర్ బాలికను కిడ్నాప్ చేసి లైంగికంగా వేధించడం జరిగింది. అట్టి కేసును అప్పుడు ఉన్న ఏసీపీ శృతకీర్తి సమక్షంలో చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగింది. జిల్లా స్పెషల్ ఫోక్సో కోర్టులో వాదోపవాదాలు విన్న న్యాయమూర్తిరాలు హరీష నిందితుడికి రూ.25వేల జరిమానా, 20ఏళ్ల జైలు శిక్షా విధిస్తూ తీర్పును వెల్లడించినట్లు తెలిపారు.

# మహారాష్ట్ర ప్రజలు విజ్ఞతతో ఓటెయ్యాలి





శంషాబాద్, మేజర్ న్యూస్ (నవంబర్ 13) : మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా ధారావి నియోజకవర్గం లోని గోపీనాథ్ కాలనీలో జరిగిన సభలో ఏఐసీసీ స్టార్ క్యాంపెయినర్ శ్రీ కన్నయ్య కుమార్ మరియు ముంబై కాంగ్రెస్ అధ్యక్షురాలు, పార్లమెంట్ మెంబర్ వర్షా గైక్వాడ్ తో కలిసి పాల్గొన్న ధారావి నియోజకవర్గ ఏఐసీసీ ఇంచార్జ్, తెలంగాణ ఆర్జీపీఆర్ ఎస్ చైర్మన్ రాచమల్ల సిద్దేశ్వర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో బీజేపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మత పేరుతో ప్రజలో వైషమ్యం రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. మహారాష్ట్ర ప్రజలు ఈ అవకాశాన్ని గ్రహించి విజ్ఞతతో తమ ఓటును వినియోగించి మహా అఘాడి ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## మృతుడి కుటుంబానికి శివ మాల ధారణ స్వాముల ఆర్థిక సహాయం



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (నవంబర్ 13 ) ఆమనగల్లు మున్సిపాలిటీకి చెందిన ఇందూరి మల్లేష్ ,యాదమ్మల కుమారుడు ఇందూరి మహేష్ అలియాస్ నిఖిల్ ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆమనగల్లు శివ మాల ధారణ స్వాములు బుధవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అనంతరం మృతుని కుటుంబానికి 22 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో శివ మాలాధారణ స్వాములు సహారా శీను, బిట్టి సాయిలు నాగిళ్ల శ్రీను నాగిళ్ల జగన్, లింగంపల్లి అశోక్ ,గుండ్రాతి కుమార్ గౌడ్, బి.వి.ఆర్, పద్మ ప్రశాంత్, మేదరి శీను, దుర్గాప్రసాద్, దేవరాజు, గన్నోజు రాజశేఖర్, సత్యం, మద్దూరి నరేష్, బాలు, శివ, మహేష్, మహేందర్, బుల్లు గణేష్, గుండె యాది, నాగిళ్ల అమర్, కృష్ణ, నాగిళ్ల అశోక్, వెంకటేష్, శ్రీను, బుల్లెట్ శివ, తదితరులు పాల్గొన్నారు.

# గ్రూపు-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్



సమావేశంలో పాల్గొన్న అధికారులు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (నవంబర్ 13)ః పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని గ్రూప్-3 పరీక్షలో ఎలాంటి తప్పులకు తావునీయకుండా సజావుగా జరిగేలా విధులు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులకు సూచించారు. బుధవారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించే గ్రూప్-3 పరీక్షలకు సంబంధించి చేపట్టాల్సిన విధులు, జాగ్రత్తలపై ఉన్నతాధికారులతో కలిసి కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, కలెక్టర్ కార్యాలయ సముదాయంలో చీఫ్ సూపరింటెండ్స్, రూట్ ఆఫీసర్స్, బయోమెట్రిక్ అధికారులు, పరిశీలకులు, ఇన్విజిలేటర్ లు శిక్షణ పొందుతున్న అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు, మార్గదర్శకాలను అందించారు. అనంతరం అధికారులు ఉద్దేశించి అదనపు కలెక్టర్ సుదీర్ మాట్లాడుతూ... జిల్లాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-3 పరీక్షలకు 10196 మంది అభ్యర్థులు హాజరు అవుతున్నారన్నారు. పరీక్షల నిర్వహణకు 31 కేంద్రాలను గుర్తించగా అందులో వికారాబాద్ మండలంలో 14, తాండూర్ లో 11, పరిగిలో 5 అదేవిధంగా పూడూరు మండలంలో 1 కేంద్రంలో పరీక్షలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎంతోమంది నిరుద్యోగ యువత దీర్ఘకాలంగా పరీక్షలకు సిద్ధమవుతున్నారని, ఇలాంటి కీలకమైన పరీక్షను సవాల్ గా తీసుకొని అన్ని జాగ్రత్తలతో పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పరీక్ష విధులు నిర్వహించే అధికారులు ఎలాంటి తప్పిదాలు చేసిన తీవ్రమైన చర్యలు ఉంటాయనే విషయాన్ని గుర్తించాలని ఆయన సూచించారు. ఇప్పటికే పరీక్షా విధులకు కేటాయించిన అధికారులకు ఎలాంటి మినహాయింపు ఉండదని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు తీసుకురాకుండా ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రాల్లోకి పంపించాలని ఆయన సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద పూర్తి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళా అభ్యర్థులను తనిఖీ చేసే క్రమంలో కచ్చితంగా మహిళా సిబ్బంది, మహిళా పోలీసులు ఉండాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రానికి గంట ముందే రావడానికి సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ అభ్యర్థులకు సూచించారు. గ్రూప్-3 పరీక్షలు నవంబర్ 17న రెండు విడతలుగా పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఉదయం 10 గంటల నుండి 12-30 వరకు అదేవిధంగా రెండవ విడత మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5-30 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 18వ తేదిన ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12-30 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అభ్యర్థులు పరీక్షా సమయానికి గంట ముందుగానే అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి వచ్చేలాగా ప్రణాళికతో ఉండాలని ఆయన సూచించారు. వీడియో కాన్ఫరెన్స్, శిక్షణ కార్యక్రమంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ రీజినల్ కోఆర్డినేటర్లు అరవింద్ రెడ్డి, నరేంద్రబాబు, డి.ఎస్.పి జానయ్య, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నేహమత్ అలీ లు పాల్గొన్నారు.

# కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి అరెస్ట్‌తో ఎక్కడ చూసిన చర్చే చర్చ

● విమర్శలు, ప్రతి విమర్శలకు దిగిన కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నేతలు ● నోరు మేదపని సొంత అన్నా పట్నం, వదిన సునీత రెడ్డిలు



మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి

తాండూరు మేజర్ న్యూస్ (నవంబర్ 13)ః వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, బి ఆర్ ఎస్ పార్టీ నేత ఐన పట్నం నరేందర్ రెడ్డి బుధవారం నాడు ఆగమేఘాల మీద అరెస్ట్ కావడం, వెను వెంటనే రిమాండ్ చేయడం తో ఎక్కడ చూసిన ఇదే చర్చ సాగుతుంది మూడు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ తో పాటు ఇతర అధికారులపై కొడంగల్ సెగ్మెంట్ లోని వడి చెర్ల గ్రామంలో దాడులు జరిగిన విషయం తెలిసిందే. ఈ దాడుల్లో కుట్ర కోణం దాగి ఉన్నదని ఇందులో మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి మద్దతు ఉన్నదని పోలీస్ లు వివిధ సెక్షన్స్ కింద కేసులు నమోదు చేశారు ఇందులో భాగంగానే నరేందర్ రెడ్డి ని హైదరాబాద్ నగరంలో అరెస్ట్ చేసి వికారాబాద్ లోని పోలీస్ హెడ్ క్వాటర్ కు తరలించి విచారించి కొడంగల్ లోని కోర్టు కు తరలించారు కోర్టు 14రోజుల పాటు రిమాండ్ విధించడంతో పోలీస్ లు భారీ బందో బస్తూ మధ్యలో చర్ల పల్లీ జైలుకు తరలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కేసు సంచలనం కలిగించడం తో కొడంగల్, తాండూరు, పరిగి, వికారాబాద్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఎక్కడ చూసిన చర్చే చర్చ జరుగుతుంది. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో ఎంతో ప్రాధాన్యత కనిపిస్తుంది .ఇదిలా ఉండగా నరేందర్ రెడ్డి అరెస్ట్ ఐన ఆయన సొంత అన్నా ఐన ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి తో పాటు ఆయన సతి మణి ఐన వికారాబాద్ జిల్లా జడ్పీ మాజీ చెర్మన్ మరియు మల్కాజ్ గిరి సెగ్మెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి గా కొనసాగుతున్న పట్నం సునీత రెడ్డి నోరు మెదపడం లేదు. వీరు ఇద్దరు కాంగ్రెస్ పార్టీ లో కొనసాగుతుండగా నరేందర్ రెడ్డి బి ఆర్ ఎస్ పార్టీ లో ఉన్నారు. పట్నం దంపతులు నిన్న తాండూరు వచ్చి వివిధ శుభ కార్యల్లో పాల్గొన్న ఎక్కడ ఎలాంటి కామెంట్ చెయ్యలేరు. సొంత తమ్ముడు జైలుకు పోవడం ఇక్కడ వీరు ఏమిటీ అని అక్కడక్కడ కొందరు గుస గుసలు ఆడు కోవడం కొస మెరుపు.

# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే
# సక్రమ నిర్వహణకు ముందస్తు చర్యలు

● ప్రత్యేక అధికారిణి దివ్య దేవరాజన్ సమీక్ష



సమగ్ర కుటుంబ సర్వే సమావేశంలో మాట్లాతున్న ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్(నవంబర్,13):ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారిణి దివ్య దేవరాజన్ ఆధ్వర్యంలో మేడ్చేల్ మల్కాజిగిరి జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించిన సమీక్ష సమావేశం బుధవారం మేడ్చేల్ కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో జరిగింది. ఈ సమావేశంలో సర్వే సమయాన్ని ముందుగా కుటుంబాలకు తెలియజేసి, అవసరమైన డాక్యుమెంట్లను అందుబాటులో ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని నోడల్ అధికారులను ఆమె ఆదేశించారు.సర్వే సాఫల్యానికి ఎన్యుమరేటర్లు డాక్యుమెంట్లను చూసి ప్రొఫార్మాలను ఖచ్చితంగా పూరించాలని, ఎలాంటి సందేహాలు ఉంటే సూపర్ వైజర్ లేదా నోడల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని దివ్య దేవరాజన్ సూచించారు. వలసదారులకు స్వచ్ఛందంగా తాము కోరిన చోట నమోదు చేసుకునే సదుపాయం కల్పించాలన్నారు. ఎన్యుమరేటర్లు కుటుంబ సభ్యులతో సౌమ్యంగా మాట్లాడి, ప్రత్యేక్ష పరిశీలన ద్వారా సక్రమ సమాచారం సేకరించాలని ఆమె సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో జిల్లాలోని గ్రూప్-3 పరీక్షల నేపథ్యంలో సర్వే పూర్తవడానికి కొంత ఆలస్యమవుతుందని మేడ్చేల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం వివరించారు. పరీక్షల నిర్వహణతో సర్వే కొంత ఆలస్యమవుతున్నప్పటికీ, సర్వే నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్న్ డి. విజయేందర్ రెడ్డి, ఆర్డీఓలు సైదులు, శ్యాం ప్రకాష్, డీఆర్‌డీఓ సాంబశివరావు, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత, వ్యవసాయ శాఖ అధికారి చంద్రకళ, పౌర సరఫరా డీఎం సుగుణబాయి, యువజన అధికారి గోపాల్ రావు, మత్స్య శాఖ అధికారి, పరిశ్రమల శాఖ అధికారి ప్రశాంత్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి బాబు మోసిస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం, అధికారులు కలెక్టరేట్‌లోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను పరిశీలించి, అక్కడ అందుబాటులో ఉన్న పదార్థాలను రుచి చూశారు.




# ఈ నెల 15న ధర్తి ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకం కార్యక్రమం

● ప్రజావాణి హాల్‌లో ప్రత్యక్ష ప్రసారం



జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి. వినోద్ కుమార్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (నవంబర్ 13)ః జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జి. వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 15న ఉదయం 11:00 గంటలకు 'ధర్తి ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్' పథకం ప్రారంభ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్ లో ప్రత్యక్ష ప్రసారము ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని గిరిజన సంఘాల నాయకులు, మేధావులు, యువతీ యువకులు, ఉద్యోగులు, రాజకీయ ప్రముఖులు పాల్గొని ఈ పథకానికి విజయవంతం చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి జి.వినోద్ కుమార్ కోరారు.

# న్యాయ సేవా సంస్థలో ఉద్యోగావకాశాలు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (నవంబర్ 13)ః మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ లో ఉద్యోగ నియామకాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉద్యోగాలు:ఇందులో స్టెనో , టైపిస్ట్ - పోస్ట్ ఒకటి ఖాలీగా ఉంది. డిగ్రీతో పాటు, షార్ట్ హ్యాండ్ (హయ్యర్) నిమిషానికి 120 పదాల వేగంతో టైప్ చేయగలిగి ఉండాలి. అలాగే, ఇంగ్లీష్ టైపింగ్ (హయ్యర్) నిమిషానికి 45 పదాల వేగంతో టైప్ చేయాలి. జనరల్ కేటగిరీ కి ఈ పోస్ట్ కేటాయించారు. అదేవిధంగా, రికార్డు అసిస్టెంట్ పోస్ట్ ఒకటి ఖాలీగా ఉంది. దీనికి10వ తరగతి పాస్ అయిన అభ్యర్థులకు కేటాయించారు. దీనిని కూడా ఓ.సీ కేటగిరికి కేటాయించారు. దరఖాస్తు విధానం:అభ్యర్థులు రిజిస్టర్ పోస్ట్ లేదా స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తులను పంపాలి. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తును ఈ నెల 30 లోగా చైర్మన్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ, మేడ్చల్ - మల్కాజిగిరి డిస్ట్రిక్ట్ కోర్ట్ కాంప్లెక్స్, నేరెడ్మెట్ , మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అడ్రస్ కు పంపుకోవాలి. వివరాల కోసం
వెబ్‌సైట్: మరింత సమాచారం కోసం అభ్యర్థులు
https://medchalmalkajgiri.dcourts.gov.in/ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

# తాండూరులో జరిగిన శుభకార్యల్లో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విఫ్ మహేందర్ రెడ్డి

● బిజీ బిజీగా గడిపిన పట్నం



శుభ కార్యల్లో పాల్గొన్న పట్నం మహేందర్ రెడ్డి

తాండూరు మేజర్ న్యూస్ (నవంబర్ 13)ః వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో బుధవారం నాడు జరిగిన వివిధ పెండ్లి శుభ కార్య క్రమాలల్లో ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు తదితరులతో కలిసి ఆయన పాల్గొన్నారు. పట్టణంలోని వినాయక కన్వీన్షన్ పంక్షన్ హల్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా డీసీసీబి వైస్ చెర్మన్ రవి గౌడ్ అన్నా కుమారుడైన మాజీ సర్పంచ్ మేఘనత్ గౌడ్ వివాహానికి పట్నం హాజరై నూతన వదు వరులను ఆశీర్వాదించారు. అలాగే పట్టణంలోనిగగరాని, తులసి, ఆర్య వైశ్య, తదితర పంక్షన్ హల్స్ లో జరిగిన శుభ కార్యల్లో ప్రభుత్వచీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. పట్నం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు వివిధ శుభ కార్యల్లో పాల్గొంటు బిజీ బిజీ గా గడిపారు. మహేందర్ రెడ్డి రాకతో పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమలల్లో మున్సిపల్ చెర్మన్ స్వప్న, సీనియర్ నేతలు పురుషోత్తం రావు, డాక్టర్ సంపత్ కుమార్, డీసీసీబి వైస్ చెర్మన్ రవి గౌడ్, యాలాల సోసైటీ చెర్మన్ సురేందర్ రెడ్డి, మారేపల్లి గోపాల్ రెడ్డి, గడ్డలి రవీందర్, మాజీ కౌన్సిలర్ పర్మిళ, రఘు, తదితరులు పాల్గొన్నారు.




వికారాబాద్ మెడికల్ కళాశాలలో పొగాకు, మాదకద్రవ్య వినియోగంపై అవగాహన
వికారాబాద్, మేజర్‌న్యూస్ (నవంబర్ 13)ః

# లగచర్ల ఘటనలో ఎ-1గా నరేందర్ రెడ్డి

- అన్ని ఆధారాలతోనే మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి రిమాండ్
- 47 మందిని గుర్తించాము ఇంకా చాలా మందిను గుర్తించాల్సి ఉంది
- 21 మందిని జ్యూడిషియల్ రిమాండ్ కు తరలింపు
- మిగితా వాళ్ల కోసం నాలుగు టీములతో గాలిస్తున్నాము
- వికారాబాద్ కలెక్టరేట్లో మీడియాతో ఐ జి సత్యనారాయణ.

వికారాబాద్, మేజర్‌న్యూస్ (నవంబర్ 13): వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం, లగచర్ల గ్రామంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారులపై జరిగిన దాడి ఘటనలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని ఏ1 గా చేర్చడం జరిగిందని, సాంకేతికంగా అన్ని ఆధారాలతో ఆయనను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టడం జరిగిందని మల్టీ జోన్ 2 ఐజిపి వి.సత్యనారాయణ వెల్లడించారు. బుధవారం ఉదయం హైదరాబాద్ లో నరేందర్ రెడ్డి అరెస్ట్ తో మొదలైన హైడ్రామా సాయంత్రం అయన రిమాండ్ తో ముగిసింది. నరేందర్ రెడ్డికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించగా, ఆయనను చర్లపల్లి జైలుకి తరలించారు. ఈ సందర్భంగా ఐజిపి వి.సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ.. లగచర్ల దాడి ఘటనలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి పాత్ర చాలా కీలకం. అందుకే నరేందర్ రెడ్డిని పోలీస్ కస్టడీకి ఇవ్వాలని కోర్టులో పిటిషన్ వేశామన్నారు. రేపు కస్టడీపై కోర్టులో వాదనలు జరుగుతాయి. పక్కా ప్లాన్ ప్రకారమే కలెక్టర్ పై దాడి చేశారని, దాడి ఘటనలో లగచర్ల గ్రామస్తులు కాకుండా బయట వ్యక్తులు, భూమి లేనివారే ఎక్కువ ఉన్నట్లు మా విచారణలో తేలిందన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఐజి సత్యనారాయణ

మంగళవారం సాయంత్రం నుండి 47 మందిని విచారణ చేయడం జరిగింది. దాడికి ఎలాంటి సంబంధం లేదు అని నిర్ధారణ అయిన 35 మందిని ఒకేసారి వదిలి పెట్టడం జరిగింది. మంగళవారం 16 మందిని రిమాండ్ చేయగా, బుధవారం పట్నం నరేందర్ రెడ్డితో పాటు విశాల్, రమేష్, సాయిలు, బోగమోని మహేష్ ( ప్రధాన నిందితుడు బోగమోని సురేష్ సోదరుడు) తో కలిపి మరో నలుగురిని రిమాండ్ కు తరించాం. మొత్తం ఇప్పటి వరకు 21 మందిని రిమాండ్ చేయడం జరిగింది. నిన్నటి వరకు ఏ1 గా బోగమోని సురేష్ ఉండగా నేడు నరేందర్ రెడ్డిని ఏ1 గా, బోగమోని సురేష్ ఏ2 గా చేర్చడం జరిగింది. మిగతా నిందితుల కోసం నాలుగు పోలీస్ బృందాలు గాలిస్తున్నాయి. వారిలో ప్రధానంగా భోగమోని సురేష్, గోపాల్ నాయక్, దేవదాసు, విజయ్, విట్టల్ లను త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఐజిపి వి.సత్యనారాయణ వెల్లడించారు.

# లగచర్ల ఘటనలో పట్నం నరేందర్‌రెడ్డికి 14 రోజుల రిమాండ్

- భారీ పోలీసు బందోబస్తు మధ్య కొడంగల్ కోర్టులో హాజరు
- 14 రోజుల రిమాండ్‌కు న్యాయమూర్తి ఆదేశాలు
- అరెస్టుతో చర్లపల్లి జైలుకు తరలింపు

కొడంగల్, మేజర్ న్యూస్ (నవంబరు 13): వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దుద్యాల మండలం లగచర్లలో ఇండస్ట్రీయల్ కారిడార్ భూ అభిప్రాయ సేకరణలో జిల్లా స్థాయి అధికారులపై దాడుల సంఘటనలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రమేయం ఉందనే అభియోగాలపై బుధవారం హైదరాబాద్‌లో పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. అక్కడి నుంచి వికారాబాద్ డీటీసీ కార్యాలయంలో ఎస్పీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో విచారించారు. అక్కడి నుంచిభారీ పోలీసు బందోబస్తు మధ్య కొడంగల్ ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి కొడంగల్ మున్సిఫ్ కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరుపర్చారు. ఈ సంఘటనలో పట్నం నరేందర్‌రెడ్డికి న్యాయమూర్తి 14 రోజులు జ్యూడిషియల్ రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు భారీ పోలీసు బందోబస్తు మధ్య తరలించారు. జిల్లా కలెక్టర్, అధికారులపై దాడి సంఘటనలో ఏ1 గా పట్నం నరేందర్‌రెడ్డి, ఏ21 గా బోగమోని మహేశ్, ఏ22 గా బ్యాగరి విశాల్, ఏ24గా నీరటి సాయిలు, ఏ27గా నీరటి రమేశ్, ఏ3గా శివను అరెస్టు చేసి జైలుకు తరలించారు.



కొడంగల్ మున్సిఫ్ కోర్టు ముందు పోలీసుల బందోబస్తు



ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం పట్నం నరేందర్‌రెడ్డిని కోర్టులో హాజరుపర్చేందుకు తరలిస్తున్న పోలీసులు

## వాటర్ వర్క్స్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన జీ.ఓ.ని అమలు చేయాలి

### ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి



రాజేంద్రనగర్(మేజర్ న్యూస్ )ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ డివిజన్ జనరల్ మేనేజర్ సాయి లక్ష్మి కి వినతి పత్రం అందచేసిన వాటర్ వర్క్స్ ఉద్యోగులు హైదరాబాద్ నగర మంచినీటి సరఫరా మురుగు నీటిపారుదల మండలి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్స్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. కార్మికులకు జీ.ఓ.ఎం ఎస్ నెంబర్ 60 ప్రకారం వాటర్ సుప్లయ్ విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రూ.,19500/-లు, కంప్యూటర్ ఆపరేటర్స్ లకు రూ.,22,750/-లు కనీస వేతనాలు అమలు చేయాలి అని ఈ యొక్క జీ.ఓ.ని గత ప్రభుత్వం తేదీ:11/07/ 2021 నాడు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చి న 2021 సంవత్సరంలో ఇచ్చిన జీవో అమలు చేసి అప్పటి నుండి ఏరియస్ కూడా కార్మికులకు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీ.వో.ని అమలు చేయకుంటే రాజేంద్రనగర్ డివిజన్ వాటర్ వర్క్స్ కార్యాలయం ముందు ధర్నా లు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.మహేందర్ శ్రీనివాస్ రెడ్డి చెన్నకేశవులు గౌడ్ ప్రవీణ్ యాదవ్ రామకృష్ణ రమల స్వాతి, పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల అరెస్టు అప్రజాస్వామికం

### మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

ఫరూఖ్‌నగర్, మేజర్‌న్యూస్ (నవంబరు 13): శాంతియుతంగా నిరసన తెలిపేందుకు సిద్ధమైన లగచర్ల రైతులను రెచ్చగొట్టే విధంగా ప్రభుత్వం ప్రయత్నించ డమే కాకుండా అప్రజాస్వామికంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అరెస్టు చేశారని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. రైతులకు అండగా నిలిచేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ఫార్మాసిటీ పేరుతో పేదల భూములను గుంజుకోవాలని చూడడం సరికాదన్నారు. అభివృద్ధి జరగాలే కానీ, ఆ కారణంగా అమాయక రైతులు రోడ్డుపాలు కాకూడదన్నారు. ఎంతోకాలంగా కొడంగల్ నియోజకవర్గ ప్రజలు ఫార్మాసిటీని వ్యతిరేఖిస్తుంటే ప్రభుత్వం ఎందుకు వెనక్కి తగ్గడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై కక్ష్య సాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు.



# నియామక ప్రక్రియలో అభ్యర్థులకు మోసపూరిత కాల్స్

- అప్రమత్తంగా ఉండాలని సూచన
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ : టి.రఘు నాథ స్వామి



మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్ (నవంబర్,13): మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్టాఫ్ నర్స్ ఉద్యోగాల నియామక ప్రక్రియ లో అనుమానాస్పద కాల్స్‌కు సంబంధించిన ఫిర్యాదులు వెలుగు చూశాయి. నియామక ప్రక్రియ, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ఆధ్వర్యంలో, జిల్లా సెలక్షన్ కమిటీ పర్యవేక్షణలో జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. రఘునాథ స్వామి అధికారికంగా తెలిపారు. ఇటీవలి కాలంలో కొంతమంది అభ్యర్థులకు 09836330846 నంబర్ నుండి కాల్స్ వచ్చినట్లు ఫిర్యాదులు అందాయి. ఈ కాల్ చేసిన వ్యక్తి తాను వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిగా చెప్పుకొని, అభ్యర్థులు ఎంపిక అయినట్లు, మరియు ఈజీట్టటజీచ్టి క్ఖభీజీచ్ఫిజూ ఫ్ఖిజ్టూజి ఈఖఇచ్టట్రఖ్ఖ్ట పేరుతో గూగుల్ పే/ఫోన్ పే నంబర్ 7003386564కి డబ్బులు చెల్లించాలని కోరినట్లు తెలిపారు. ఈ ఘటనపై షామీర్పేట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగింది. ఐటీ చట్టం -2008 ప్రకారం సెక్షన్ 319(2), 318(4) బిఎన్ఎస్, 66సి, 66డి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోంది. డాక్టర్. రఘునాథ స్వామి, అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద కాల్స్ వస్తే వాటిని నమ్మవద్దు. నియామకాలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ అధికారిక వెబ్‌సైట్ లేదా తెలుగు దినపత్రికల ద్వారా మాత్రమే పొందగలరు. అనుమానాస్పద కాల్స్ వస్తే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930 లేదా 1800-599-4788 కు కాల్ చేయవచ్చు. ఇది ప్రజా ప్రయోజనాల దృష్ట్యా విడుదల చేసిన ప్రకటన అని ఆయన పేర్కొన్నారు.

## బడంగ్పేట్ కార్పొరేషన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు

- పలు కాలనీవాసులు మేయర్‌కు వినతి



బీట్ రోడ్డు గురించి మేయర్ కు వినతి,

బాలాపూర్ మేజర్ న్యూస్( నవంబర్ 13): మహేశ్వరుని నియోజకవర్గంలోని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్ గూడ రోడ్ నెంబర్ 2 కాలనీ సభ్యులు తో పాటు కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు బొయిపల్లి రాఘవేందర్ రెడ్డి కలిసి బీట్ రోడ్డు గురించి కార్పొరేషన్ మేయర్ పారిజాత నరసింహారెడ్డికి వినేత్పత్రాన్ని అందజేశారు. మేయర్ తోపాటు మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి సానుకూలంగా స్పందించి అతి తొందరలోనే రోడ్డు కంప్లీట్ చేపిచ్చే బాధ్యత నాదీనని హామీ ఇచ్చారు. అదేవిధంగా బుధవారం బాలాపూర్ పాత గ్రామం మరియు క్వారట్స్ కాలనీలో సీసీ రోడ్ నిర్మాణ పనులను కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్‌తో పాటు కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు ఉండేటట్లు చూడాలని అధికారులకు ఆదేశాలు సూచించారు. విచ్చేసిన అతిథులకు శాలువాతో సత్కరించి కాలనీవాసులు ధన్యవాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డి ఈ నరసింహారాజు, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేషన్ కార్పొరేటర్లు, నాయకులు ఎర్ర జైహింద్, టేకుల సుధాకర్ రెడ్డి, యాదయ్య, సుధాకర్, ప్రతాప్ రెడ్డి, అయోధ్య చారి, తదితరులు, కాలనీ సభ్యులు తరపున బోయపల్లి రాఘవేంద్ర రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



బాలాపూర్ పాత గ్రామంలో సిసి రోడ్ నిర్మాణ పనులు.

# రైతులు పండించిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

- దళారులను నమ్మి మోసపోవొద్దు
- కోట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, జి అంజయ్య, వైస్ చైర్మన్ ఎస్ నారాయన్ రెడ్డి వెల్లడి



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం.

పెద్దేముల్, మేజర్‌న్యూస్ (నవంబర్ 13)ః రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని కోట్ పలి మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ అన్నారు. సోమవారం మండల విస్తృత పర్యటనలో భాగంగా, పెద్దేముల్ మండల పరిధిలోని జనగాం గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ం గ్రేడ్ రకం 2320,ః గ్రేడ్ రకం, 2300 సన్నాలు 2320'500 ఒక క్వింటల్ కు ఉందన్నారు రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జి అంజయ్య,ఎస్ నారాయన్ రెడ్డి, ధారాసింగ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ధారాసింగ్, జితేందర్ రెడ్డి, బంద్యప్ప, ఉప్పరి మల్లేశం, గోపాల్, విద్యాసాగర్, కుమార్, ఎల్లారెడ్డి,కోహీర్ రవి, కిరణ్, సాబేర్,శివ కుమార్, రాములు యాదవ్,ఎండిమైపూస్, యాదప్ప, అనంతయ్య,హర్షవర్ధన్ రెడ్డి, హరి సుధన్ రెడ్డి డి వై నర్సింలు,చెక్కల రాములు, గడ్డం మల్లప్ప గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బంది సమయపాలన పాటించాలి

- జాతరకు వచ్చే భక్తులు జాగ్రత్తలు తీసుకునే విధంగా అవగాహన కల్పించాలి
- జాతరలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని పరిశీలన
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ



ధారూర్, మేజర్ న్యూస్ (నవంబర్ 13)ః జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి పీహెచ్సీలో అందిస్తున్న సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోగుల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా అన్ని రకాల సేవలు సకాలంలో అందించాలని వైద్యాధికారిని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల నిలువ గదిని, వ్యాక్సిన్ నిలువ ఉంచు రిఫ్రిజిరేటర్లను పరిశీలించారు. సిబ్బంది పి.హెచ్.సి లో సమయపాలన పాటించాలని లేనియెడల చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం స్టేషన్ ధారూర్ లో జరుగుతున్న క్రైస్తవులు పవిత్రంగా భావించి జరుపుకునే జాతరలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని సందర్శించి అక్కడికి వచ్చే భక్తులకు ఏమాత్రం అసౌకర్యము, అనారోగ్యము కలిగిన క్యాంపులో చికిత్స అందించే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని, భక్తులకు పరిసరాల పరిశుభ్రత స్వచ్ఛమైన తాగునీరు, బహిరంగ ప్రదేశాలలో అమ్మే తినుబండారాల గురించి జాగ్రత్తలు తీసుకునే విధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం క్యాంపులో అందుబాటులో ఉన్న మందులను పరిశీలించి ఇబ్బంది అందరూ కూడా వారికి కేటాయించిన షిఫ్ట్ ల ప్రకారం పని చేయాలని ఆదేశించారు.

## వివాహ దంపతులను ఆశీర్వదించిన కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ



దోమ,మేజర్‌న్యూస్ (నవంబర్ 13)ః దోమ మండలపరిధిలో ని మోత్కూర్ గ్రామంలో గరుగుపల్లి యశోద మహిపాల్ రెడ్డికూతురు శిరీష మరియు లక్ష్మి నర్సింహా రెడ్డి వివాహమునకు హాజరై దంపతులను ఆశీర్వదించిన కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ. ఈ కార్యక్రమంలో లింగయ్య, మోగులయ్య, రాములు, శ్రీనివాస్, అక్బర్, నర్సింలు, సారంగి, కుటుంబ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఎస్‌కేఆర్ ట్రస్ట్ ఆర్థిక సాయం



మర్పల్లి, మేజర్‌న్యూస్ (నవంబర్ 13)ః మర్పల్లి మండల పరిధిలోని రావులపల్లి గ్రామానికి చెందిన ఉప్పరి అనసూజా మంగళవారం రాత్రి మృతి చెందింది. అట్టి విషయం తెలుసుకున్న ఎస్ కే ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సనగారి కొండల్ రెడ్డి అనసూజా అంత్యక్రియలకు 5 వేల రూపాయలు పంపించగా స్థానిక నాయకులు గ్రామస్తులతో కలిసి మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎస్ కే ఆర్ పంపిన రూ. 5 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో అబ్రహం, నర్సింహులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలి




వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ బాస్కర్ రెడ్డి.

ధారూర్, మేజర్ న్యూస్ (నవంబర్ 13)ః మండల పరిధిలోని గట్టెపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం అధికారులు,వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు సాఫీగా కొనసాగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని,రాష్ట్ర ప్రభుత్వం కూడా సన్న రకం వడ్లకు ఐదు వందల రూపాయల బోనస్ కూడా ఇవ్వడం జరుగుతుందని,వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎక్కడ సమస్య ఉన్న నా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాన్ సింగ్ గారు,మాజీ జెడ్పిటిసి పట్లోళ్ల రాములు,వైస్ చైర్మన్ లింగంపల్లి అశోక్ ముదిరాజ్, నాయకులు,బాబా కాన్,అమరేశ్వర్, వాణిశ్రీ, రవీందర్,ప్రజాప్రతినిధులు, రాజేందర్, రమేష్ కృష్ణ,అధికారులు రైతులు,మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న బాధిత కుటుంబానికి అండగా మండల పంచాయతీ కార్యదర్శులు



ఆర్థిక సహాయం అందిస్తున్న మండల పంచాయతీ కార్యదర్శులు

కుల్కచర్ల రూరల్,మేజర్ న్యూస్ (నవంబర్ 13)ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో ఇల్లు పూర్తిగా దగ్ధమైన బాధిత బండవెల్కిచర్ల ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని మండల పంచాయతీ కార్యదర్శులు పేర్కొన్నారు. అగ్నిప్రమాదంలో ఇంట్లో ఉన్న ఆహార ధాన్యాలు, వంట సామాగ్రి, దుస్తులు, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోవడంతో మండల పంచాయతీ కార్యదర్శులు స్పందించి బాధిత కుటుంబానికి రూ.25 వేలు ఎంపీడీవో రామకృష్ణ నాయక్, ఎంపీఓ భాస్కర్ గౌడ్ చేతుల మీదగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆపదలో ఉన్న బాధ కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## తాండూరులో జరిగిన శుభ కార్యల్లో పాల్గొన్న మాజీ జడ్పీ చెర్మన్ సునీత రెడ్డి

- నూతన వదు వరులను ఆశీర్వాదించిన పట్నం సునీత రెడ్డి



వేడుకల్లో పాల్గొన్నా సునీత రెడ్డి

తాండూరు మేజర్ న్యూస్ (నవంబర్ 13)ః తాండూరు పట్టణంలో బుధవారం నాడు వివిధ చోట్ల జరిగిన పలు శుభ కార్యల్లో వికారాబాద్ జిల్లా జడ్పీ మాజీ చెర్మన్ మరియు మల్కాజ్ గిరి సెగ్మెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఐన సునీత మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలతో కలిసి పాల్గొన్నారు. టౌన్‌లోని వినాయక కన్వీన్షన్ పంక్షన్ హల్ లో జరిగిన ఉమ్మడి రంగా రెడ్డి జిల్లా డీసీసీబీ వైస్ చెర్మన్ రావిగౌడ్ అన్నా కుమారుడైన మాజీ సర్పంచ్ మేఘనత్ గౌడ్ పెండ్లి వేడుకల్లో పాల్గొని వదు వరులను ఆశీర్వాదించారు. మిగితా చోట్ల జరిగిన వివిధ శుభ కార్యల్లో కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమలల్లో రవి గౌడ్ తో పాటు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పర్మిళ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## వివిధ శుభ కార్యల్లో పాల్గొన్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

- నూతన వదు వరులను ఆశీర్వాదించిన ఎమ్మెల్యే



పెండ్లి వేడుకల్లో పాల్గొన్నా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు మేజర్ న్యూస్ (నవంబర్ 13)ః తాండూరు పట్టణంలో జరిగిన వివిధ శుభ కార్యక్రమలల్లో బుధవారం నాడు తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొన్నారు పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా ఉమ్మడి రంగా రెడ్డి జిల్లా డీసీసీబీ వైస్ చెర్మన్ రవి గౌడ్ అన్నా కుమారుడైన మాజీ సర్పంచ్ మేఘనత్ గౌడ్ పెండ్లి వేడుకల్లో పాల్గొన్నారు. తాండూరు టౌన్‌లో జరిగిన ఐదు ఆరు చోట్ల వేడుకల్లో పాల్గొన్నారు ఎమ్మెల్యే వెంట రవి గౌడ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు మురళీ కృష్ణ గౌడ్, అబ్దుల్ రాహుఫ్, పురుషోత్తం రావు, అనిల్, భీమయ్యతో పాటు పలువురు ఉన్నారు అలాగే ఎమ్మెల్యే సోదరుడైన సీనియర్ నేత శ్రీనివాస్ రెడ్డి కూడా వివిధ శుభ కార్యల్లో పాల్గొన్నారు ఆయన వెంట పలువురు నేతలు ఉన్నారు.

# ఏడాది వయసున్న బాబుకు అరుదైన ఇండియన్ రోబోటిక్ సర్జరీ

## ప్రీతి యూరాలజీ, కిడ్నీ ఆస్పత్రి ఘనత



హైదరాబాద్, మేజర్ న్యూస్: కేవలం ఏడాది వయసున్న బాబుకు అత్యాధునిక ఇండియన్ రోబోటిక్ టెక్నాలజీ ఉపయోగించి అరుదైన కిడ్నీ శస్త్రచికిత్సను నగరంలోని ప్రీతి యూరాలజీ కిడ్నీ ఆస్పత్రికి చెందిన చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వి. చంద్రమోహన్ చేశారు. అత్యంత చిన్న వయసున్న పిల్లల్లో కూడా సంక్లిష్టమైన కేసులకు చికిత్స చేసేందుకు రోబోటిక్ విధానం ఉపయోగపడుతుందన్న విషయం ఈ శస్త్రచికిత్సతో నిరూపితమైంది. ఎస్ ఎస్ ఐ మంత్ర రోబో పద్ధతిని, భారతీయ సంతతికి చెందిన అమెరికన్ వైద్యుడు, గుండె నిపుణుడు డా. సుధీర్ శ్రీవత్సవ కనిపెట్టారు.రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన ఒక క్యాబ్డ్రైవర్ కుమారుడికి ఇప్పుడు ఏడాది వయసు. అతడికి పుట్టుకతోనే రెండు కిడ్నీలలో వాపు ఉంది. దీనికి చికిత్స చేయకపోతే.. మూత్రపిండాల పనితీరు తీవ్రంగా దెబ్బతింటుంది. సాధారణంగా ఇలాంటి సమస్యలకు ఓపెన్ శస్త్రచికిత్స చేసేవారు, తర్వాత లాపరోస్కాపిక్ పద్ధతిలో చేస్తున్నారు. అయితే ఈ కేసులో పూర్తి స్వదేశీ టెక్నాలజీతో రూపొందించిన ఎస్ఎస్ఐ మంత్ర అనే రోబోటిక్ సిస్టంతో శస్త్రచికిత్స చేయాలని డాక్టర్ చంద్రమోహన్ నిర్ణయించారు. రెండు కిడ్నీలకు శస్త్రచికిత్స చేయడానికి కేవలం నాలుగు చిన్న రంధ్రాలు మాత్రమే చేశారు. లాపరోస్కాపిక్ సర్జరీలలో అయితే సర్జన్లు తప్పనిసరిగా రోగికి బాగా దగ్గరగా ఉండి, కొన్ని గంటల పాటు చేత్తోనే సర్జికల్ పరికరాలను ఉపయోగించాల్సి ఉంటుంది. అయితే, రోబోటిక్ సర్జరీలో వైద్యులు ఒక కన్సోల్ వద్ద ఉండి, లోపలి దృశ్యాలను మరింత పెద్దగా చూస్తూ అత్యంత కచ్చితత్వంతో, యాంత్రిక చేతులతో, తక్కువ రంధ్రాలతో శస్త్రచికిత్స చేయగలరు. ఏడాది మాత్రమే వయసున్న ఈ బాబుకు కేవలం నాలుగు రంధ్రాలు చేసి, డాక్టర్ చంద్రమోహన్ రెండు కిడ్నీలకూ శస్త్రచికిత్స చేశారు. దీనివల్ల ఎనస్థీషియా ఎక్కువ ఇవ్వాల్సిన అవసరం తప్పింది, ఆస్పత్రిలో ఎక్కువ రోజులు ఉండక్కర్లేదు, రోగి కుటుంబానికి ముప్పు తగ్గడంతో పాటు ఖర్చు కూడా గణనీయంగా తగ్గింది. "కేవలం ఏడాది వయసున్న బాబుకు ఇండియన్ రోబోటిక్ శస్త్రచికిత్స చేయడం చాలా సంక్లిష్టం. ఎందుకంటే ఇందులో కచ్చితత్వం చాలా అవసరం. కానీ దీనివల్ల ప్రయోజనాలు చాలా ఉన్నాయి. రెండువైపులకూ కలిపి ఒకే సెట్ రంధ్రాలు చేయడం వల్ల బాబును ఆస్పత్రిలో ఉంచాల్సిన సమయం కూడా తగ్గింది. వేగంగా కోలుకున్నాడు. ఇది అంతర్జాతీయ స్థాయిలో కూడా చాలా అరుదైన టెక్నిక్" అని డాక్టర్ చంద్రమోహన్ వివరించారు. శస్త్రచికిత్స పూర్తయిన తర్వాత కేవలం 24 గంటల్లోనే బాబును డిశ్చార్జి చేశారు. అతడు తల్లి దగ్గర పాలు తాగి, ఎంచక్కా ఆడుకున్నాడు కూడా. అదే ఓపెన్ సర్జరీలలో అయితే ఇలా కోలుకోవడానికి కొన్ని వారాలు కూడా పడుతుంది. భారతదేశంలో రోబోటిక్ టెక్నాలజీ ఇప్పుడు బాగా అందుబాటులోకి వచ్చింది. ఇలాంటి ప్రొసీజర్ల వల్ల చిన్నపిల్లల యూరాలజీ రంగాన్ని సమూలంగా మార్చగలగడం సాధ్యమవుతుంది. చిన్న పిల్లలకు ఇది బాగా సురక్షితం, ఖర్చు కూడా తక్కువ.

# కుక్కల దాడిలో 11మేక పిల్లలు మృత్యువాత



మాడ్గుల, మేజర్ న్యూస్ ( నవంబర్ 13): కుక్కల దాడిలో నాలుగు మేకలు మృతి చెందిన సంఘటన మాడ్గుల మండలం పల్లె తండలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు పల్లెతాండకు చెందిన హనుమంతు ఇంటి వద్ద షెడ్డులో మేక పిల్లల్ని ఉంచి తల్లి మేకలని పొలానికి మేతకు తీసుకెళ్లాడు. ఈ సందర్భంగా షెడ్డులో ఉన్న మేకపిల్లలపై కుక్కలు దాడిచేసి 11 మేక పిల్లల్ని చంపినట్లు స్థానికులు తెలిపారు. సాయంత్రం హనుమంతు షెడ్డు వద్దకు చేరుకోగా కుక్కలు అతడిపై కూడా దాడి చేయడానికి యత్నించగా వాటి బారినుంచి తప్పించుకున్నట్లు తాండావాసులు వివరించారు. మృతిచెందిన 11 మేక పిల్లలు విలువ దాదాపు రూ. 50వేలు ఉంటుందని, బాధితుడు హనుమంతును ప్రభుత్వపరంగా ఆదుకోవాలని తాండావాసులు కోరారు. ఇదిలా ఉండగా పల్లె తండ లో కుక్కల బెడదతో ప్రజలు, రైతులు తీవ్రభయాందోళనకు గురవుతున్నారని, కుక్కల బారినుంచి దూడలు, గొర్రెలు, మేకలను కాపాడాలని స్థానికులు సంబంధితశాఖల అధికారులను కోరుతున్నారు.

# దేవాలయాలపై దాడిచేసిన వారి అంగం కోస్తాం

### శంషాబాద్లో అఘోరీ నాగసాధు హెచ్చరిక



శంషాబాద్, మేజర్ న్యూస్ (నవంబర్ 13) : ఇటీవల శంషాబాద్ మున్సిపాలిటీ ఎయిర్పోర్ట్ కాలనీలో హనుమాన్ దేవాలయంలో నవగ్రహ విగ్రహాలను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన విషయాన్ని తెలుసుకుని బుధవారం నవగ్రహ విగ్రహాలను అఘోరీ నాగసాధు దర్శించుకుని త్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై దాడులు విపరీతంగా జరుగుతున్నాయి అంతేకాకుండా మహిళలపై అత్యాచారాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని అన్నారు. ఇవన్నీ చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షలు పడేలా చర్యలు తీసుకురావాలన్నారు. లేదంటే నేనే ప్రత్యక్షంగా దాడులకు పాల్పడిన దుండగుల అంగం కోసేస్తానన్నారు. హిందూ దేవాలయాలను సందర్శించడానికి వస్తే పోలీసులు నన్ను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం ప్రశ్నించారు. ఇకనైనా హిందువులంతా ఏకమై హిందూ దేవాలయాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎక్కడ హిందూ దేవాలయాలపై దాడులు జరిగిన ఆ దేవాలయాలని సందర్శిస్తాను అన్నారు. నన్ను ఎవరైనా అడ్డుకుంటే ఆత్మహత్య చేసుకోవడానికి అయినా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

# చిన్నవయసులోనే మధుమేహం

హైదరాబాద్, మేజర్ న్యూస్ : చిన్నవయసులోనే మధుమేహం వచ్చేవారి సంఖ్య గత రెండు మూడేళ్లలోనే దాదాపు రెట్టింపు అయ్యిందని, ప్రధానంగా జీవనశైలి సమస్యలు, ఒత్తిడి ఇందుకు కారణం అవుతున్నాయని కామినేని ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ జి. సందీప్ రెడ్డి తెలిపారు. నవంబర్ 14 గురువారం ప్రపంచ మధుమేహ దినం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో సుమారు 40-50 ఏళ్లు దాటిన తర్వాతవారిలోనే మధుమేహం కనిపించేది. కానీ ఇప్పుడు 20లు, 30లలో ఉన్నవారికీ ఈ సమస్య ఉంటోంది. నిత్యజీవితం తో పాటు ఉద్యోగాల్లో విపరీతమైన ఒత్తిడి ఉండడం, ఎక్కువసేపు కదలకుండా ఒకేచోట కూర్చుండిపోవడం, ఎలా పడితే అలా తినేయడం, ముఖ్యంగా ఇంట్లో వండుకోవడం మానేసి ఆర్డర్లు పెట్టుకుంటూ అనారోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ఇందుకు కారణాలవుతున్నాయి. దీనికితోడు మద్యపానం, ధూమపానం కూడా యువతలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. గంట సేపు ఒకేచోట కదలకుండా కూర్చుంటేనే.. ఒక సిగరెట్ కాల్చినంత నష్టం జరుగుతుంది. గుర్తించడం ఇలా..సాధారణంగా మధుమేహం లక్షణాలు ఏమీ లేవని వదిలేయకూడదు. మన ఇంట్లో ఎవరికైనా మధుమేహం ఉన్నా, మనకు ఊబకాయం ఉన్నా.. ఇప్పుడు 20ల నుంచే ఎప్పటికప్పుడు మధుమేహ పరీక్షలు చేయించుకోవాలి. ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, పోస్ట్ ప్రాండియల్, హెచ్బీఏ1సీ.. ఈ మూడు పరీక్షలూ చేయించుకోవాలి. ర్యాండమ్ బ్లడ్ షుగర్ చేయించడం అనవసరం. చాలామంది తమకు ఎలాంటి లక్షణాలు లేవని, అలాంటప్పుడు మధుమేహం ఉండే అవకాశం ఎందుకు ఉంటుందని అడుగుతారు. లక్షణాలు అంటే.. ఆకలి ఎక్కువ కావడం, మూత్రవిసర్జనకు ఎక్కువగా వెళ్లాల్సి రావడం లాంటివి. కానీ, అవి బయటపడేసరికి మధుమేహం చాలా ఎక్కువగా ఉండి.. దాదాపుగా ఇన్సులిన్ ఇవ్వాల్సిన అవసరం ఉంటుంది. అందుకే లక్షణాలున్నా, లేకపోయినా పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాలను బట్టి తగిన వైద్యుడి వద్దకు వెళ్లడం ముఖ్యం. దీర్ఘకాల సమస్యలు: మధుమేహం వల్ల శారీరకంగా, మానసికంగా, సమాజపరంగా కూడా చాలా రకాల సమస్యలు వస్తాయి. శారీరకంగా చూసుకుంటే.. కంటిచూపు,మూత్రపిండాలు, కాలేయం, గుండె.. ఇలా అన్ని అవయవాలూ దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. దీర్ఘకాలంలో మధుమేహం అదుపులో లేకపోతేనే ఈసమస్యలు వస్తాయి. మధుమేహం ఎక్కువైనా, తక్కువైనా కూడా మెదడు పనితీరు దెబ్బతింటుంది. దానివల్ల మానసిక సమస్యలు తలెత్తుతాయి. అలాగే ఎవరైనా సరే తమకు మధుమేహం ఉందని తెలియగానే ఒక్కసారిగా డిప్రెషన్లోకి వెళ్లిపోతారు. సమాజంలో పదిమందితో కలవలేక ఇబ్బంది పడతారు. తరచు మూత్రవిసర్జనకు వెళ్లాల్సి రావడం లాంటి వాటిని పెద్ద సమస్యలుగా భావిస్తారు. వీటినుంచి బయటపడాలంటే ముందుగా కుటుంబసభ్యుల నుంచి మద్దతు అవసరం అవుతుంది. దాంతోపాటు సమాజంలో అందరితో కలిసిమెలిసి ఉండాలి. స్నేహితులతో కలిసి తిరగడం, ముఖ్యమైన కార్యక్రమాలకు హాజరవ్వడం ద్వారా మానసికంగా దృఢంగా తయారవుతారు.

# మంచి నీటి సమస్యను పరిష్కరించండి

### సిపిఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్

నిజాంపేట్ మేజర్ న్యూస్ : పేదలకు ఒక విధంగా ధనికులకు ఒక విధంగా నీటి సరఫరా చేస్తున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని సిపిఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం సిపిఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ వాటర్ బోర్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ చంద్ర మోహన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

# గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం

బాలాపూర్ మేజర్ న్యూస్( నవంబర్ 13): మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జనప్రియ మహానగర్ ఫీడర్ పరిధిలో ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఇందుకు వినియోగదారులు తమకు సహకరించాలని ఏఈ ఆపరేషన్ లెనిన్ నగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ గురువారం నాడు అయోధ్య నగర్, ఎస్ ఐ ఎన్ ఎస్ కాలనీ, జనప్రియ మహానగర్ అపార్ట్మెంట్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అందుకు వినియోగదారులు తమకు సహకరించాలని లెనిన్ నగర్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు.

# మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ప్రచారం చేస్తున్న యూసుఫ్ ఖాద్రి



జల్ పల్లి, మేజర్ న్యూస్ (నవంబర్ 13)తెలంగాణ తరహా అభివృద్ధి కావాలంటే మహారాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీ ని గెలిపించాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ చైర్మన్ యూసుఫ్ ఖాద్రి అన్నారు.తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,మహేశ్వరం నియోజకవర్గం మైనారిటీ సెల్ చైర్మన్ యూసుఫ్ ఖాద్రినిచిల్కి నియోజకవర్గం అబ్జర్వర్ గా నియమించడంతో బుధవారం చిల్కి నియోజకవర్గంలొ అర్షద్ అహ్మద్, హంజా, జహూరుల్, ఖాదర్ లతో కలసి ముస్లిం బస్తిలలో ప్రచారం నిర్వహించారు.

# చాకలి పాండు కుమార్తె వివాహనికి పుస్తె మెట్టెలు అందించి ఉదారతను చాటిన మాజీ సర్పంచ్ స్వరూప నాగేష్ యాదవ్



గండిపేట్, మేజర్న్యూస్ (నవ ంబర్ 13) : నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన చాకలి పాండు కూతురు పెళ్లికి మాజీ సర్పంచ్ స్వరూప నాగేష్ యాదవ్ పుస్తె మెట్టలు అందజేశారు. ఈ సందర్భంగా స్వరూప నాగేష్ మాట్లాడుతూ.. తాను గతంలోనూ ఎంతో మంది పేదలకు తన వంతుగా సాయం చేశానని తెలిపారు. పేద యువతుల వివాహాలకు పుస్తె మెట్టెలు అందించి సాయం చేశానని వివరించారు. తాను సాటి మనిషికి ఈ విధంగా సాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఇక మీదట కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూనే ఉంటానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం ఆరబోతకు రహదారులే గతి

- కల్లాలు లేక ధాన్యం ఆరబోతకు కష్టాలు
- ప్రత్యామ్నాయం లేక రోడ్లపైనే ధాన్యం
- గతంలో కల్లాల నిర్మాణాలకు ముందుకురాని రైతులు
- ప్రమాదాలతో ప్రాణాలు హరీ
- ప్రతీ సీజన్లోనూ ఇదే తంతు

కొనుగోలు పూర్తయ్యే వరకు ధాన్యం రోడ్లపైనే ఉంటుంది. ఆరుగాలం కష్టం రోడ్లపైకి వచ్చింది. పండించిన ధాన్యాన్ని అమ్మే ముందు తేమ లేకుండా చేసేందుకు ధాన్యాన్ని ఆరబెట్టాలి. ఇందుకోసం వారి వారి వ్యవసాయ భూములలో వరి కల్లాలను ఏర్పాటు చేసుకోవాలి కానీ రైతులు అందుకు సుముఖంగా లేరు. ఒకప్పుడు రైతులు తమ వరి పొలాల్లోనే వరి కల్లాలని ఏర్పాటు చేసి ఆ వరి కల్లాలలో వరి ధాన్యం ఆరబోసేవారు. కానీ గతంతో పోలిస్తే ప్రస్తుతం పుష్కలమైన సాగునీరు, నిరంతరాయ ఉచిత విద్యుత్ సరఫరా, సకాలంలో విత్తనాలు, ఎరువులు, గిట్టుబాటు ధర కల్పించడంతో గత పదేళ్లలో సాగు నాలుగింతలు పెరిగింది. సాగుపై రైతాంగానికి ఆసక్తి పెరిగింది. వ్యవసాయ భూములకు రెక్కలొచ్చాయి. దీంతో ఎటు చూసినా రెండు సీజన్లలో మేడ్చల్ మండలం సస్యశ్యామలంగా కనిపిస్తోంది. అయితే పంటల సాగు పెరిగిన కొద్ది అందుకు అనుగుణంగా ప్రత్యామ్నాయ మార్గాలను రైతాంగం ఎంచుకోలేక పోయింది.



మేడ్చల్, మేజర్ న్యూస్ (నవంబర్ 13) :ధాన్యం కొనుగోలు పూర్తయ్యే వరకు ధాన్యం రోడ్లపైనే ఉంటుంది. ఆరుగాలం కష్టం రోడ్లపైకి వచ్చింది. పండించిన ధాన్యాన్ని అమ్మే ముందు తేమ లేకుండా చేసేందుకు ధాన్యాన్ని ఆరబెట్టాలి. ఇందుకోసం క్షేత్రాల్లో కల్లాలను ఏర్పాటు చేసుకోవాల్సి అవసరం ఉంది. కానీ రైతులు అందుకు సుముఖంగా లేరు. గతంతో పోలిస్తే పదేళ్లలో సాగు నాలుగింతలు పెరిగింది. మేడ్చల్ మండలంలో పుష్కలమైన సాగునీరు, నిరంతరాయ ఉచిత విద్యుత్ సరఫరా, సకాలంలో విత్తనాలు, ఎరువులు, గిట్టుబాటు ధర కల్పించడంతో సాగుపై రైతాంగానికి ఆశక్తి పెరిగింది. వ్యవసాయ భూములకు రెక్కలొచ్చాయి. దీంతో ఎటు చూసినా రెండు సీజన్లలో మేడ్చల్ మండలం సస్యశ్యామలంగా కనిపిస్తోంది. ఐతే పంటల సాగు పెరిగిన కొద్ది అందుకు అనుగుణంగా ప్రత్యామ్నాయ మార్గాలను రైతాంగం ఎంచుకోలేకపోయింది. దీంతో ప్రతి సీజన్ లో ధాన్యం కొనుగోలు సమయాల్లో రైతులతో పాటు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**కల్లాలపై రైతుల అనాసక్తి :**

పంటలు పండించడం ఒక ఎత్తు అయితే అమ్మకాలు చేయడం రైతులకు మరో ఎత్తు. పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నప్పటికీ, సరైన సమయానికి కొనుగోళ్ళు జరిగడం లేదు. దీంతోపాటు ధాన్యం అరబోతే మరో పెద్ద సమస్యగా మారింది. ధాన్యం దిగుబడి భారీగా రావడంతో ఎటు చూసినా రోడ్లపై ఆరబోసిన ధాన్యం రాశులే కనిపిస్తున్నాయి. రోడ్లన్నీ ధాన్యం రాశులతో ప్రమాదకరంగా మారాయి. అయితే రైతుల అవస్థలను దృష్టిలో పెట్టుకొని అప్పట్లో కేసిఆర్ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ క్షేత్రాల్లో కల్లాలను నిర్మించుకోవడానికి అవకాశం కల్పించింది. రాయితీనికూడా ప్రభుత్వం రైతుల ఖాతాల్లో వేసింది. అయితే అప్పట్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల పథకం మధ్యలోనే ఆగిపోయింది. రైతులు కూడా క్షేత్రాలలో కల్లాలను నిర్మించుకోవడానికి ఆసక్తి చూపలేకపోయారు. మళ్ళీ ఈ పథకాన్ని పునరుద్ధరణ చేసే అవకాశాలు లేవు. కల్లాల నిర్మాణంతో సాగుభూమి కోల్పోతామని భావించిన రైతులు ముందుకు రాలేకపోయారు. దీంతో నేటికీ ధాన్యం ఆరబోతకు రోడ్లే గత్యంతరం అవుతున్నాయి.

**ప్రాణాలు తీస్తున్న ధాన్యం ఆరబోత :**

ప్రాణాలను నిలిపే ఆహారమే ప్రాణాలను తీసే పరిస్థితి. ధాన్యం ఆరబోయడానికి రైతులకు మరోమార్గం లేక రోడ్లను ఎంచుకున్నారు. ఒక్కసారే ధాన్యం క్వింటాళ్ళుగా రావడంతో అందరు ఒకేసారి రహదారిపై ఆరబోస్తున్నారు. గ్రామాలకు వెళ్లే రోడ్లు కూడా ఆరబోతకు వాడుతారు. దాదాపు నెల రోజులకు పైగా ధాన్యం రోడ్లపై వుంటుంది. కుప్పలుగా, సంచుల్లో నింపి, ఆరబోసి ఎటు చూసినా రోడ్లపై ధాన్యం కనిపిస్తుంది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కడో ఒకచోట ప్రమాదాలు సంభవిస్తూనే వుంటాయి. ఈసారి కూడ మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో నలుగురు మృతిచెందారు. ఇలా అనేక ప్రమాదాలలో అనేకమంది గాయాల పాలయ్యారు. ప్రమాదాల దృష్ట్యా పోలీసులు కూడా తీవ్ర హెచ్చరికలు చేస్తున్నారు. ఈసారి కూడ పోలీసులు హెచ్చరికలు చేసినా ధాన్యం రోడ్లపైనే వుంది.

### రోడ్లపై ధాన్యం ఆరబోసేవారిపై చర్యలు తీసుకుంటాం : హనుమాన్ గౌడ్, ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్



నిత్యం రాకపోకలు జరిగే రోడ్లపై రైతులు ధాన్యాన్ని ఆరబెట్టకూడదు. ఇలా చేస్తుండడంతో ప్రమాదాలు జరుగు తున్నాయి. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రైతులు సహకరించాలి. రోడ్లపై ధాన్యం ఆరబోసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

## ఓఆర్ఆర్పై ఘోర ప్రమాదం
### భార్య మృతి, భర్తకు గాయాలు



కీసర,మేజర్ న్యూస్ (నవంబర్,13): ఓఆర్ఆర్పై కారు అదుపు తప్పిన దుర్ఘటనలో భార్య మృతి చెందగా, భర్తకు గాయాలైన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం ఓఆర్ఆర్లోని మైల్స్టోన్ 78 వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగిందని సీఐ వెంకటయ్య తెలిపారు . పంజాబ్ నేషనల్ బ్యాంక్ గచ్చిబౌలిలో మార్కెటింగ్ ఏజెంట్గా పనిచేస్తున్న కొలిపాలక సుమన్ తన భార్య రోషిని,(23) కుమార్తె వైష్ణవితో స్వగ్రామం నుండి స్విఫ్ట్ డిజైర్ కారులో ఉప్పల్ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రోషిని తీవ్ర గాయాల పాలై ఆసుపత్రిలో మృతి చెందగా, సుమన్కు స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ సందర్భంగా సిఐ వెంకటయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమ నిర్మాణాన్ని కూల్చిన హైడ్రా అధికారులు



కీసర,మేజర్ న్యూస్: నాగారం మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు స్థలాన్ని కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపట్టారని స్థానిక కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు బుధవారం హైడ్రా అధికారులు భారీ బలగాలతో వచ్చి జేసీబీ సహాయంతో ఆ అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా హైడ్రా అధికారులు మాట్లాడుతూ, రోడ్డు స్థలాన్ని కబ్జా చేసుకోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, కాలనీ వాసులు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందని తెలిపారు. అన్ని పత్రాలు పరిశీలించిన అనంతరం కబ్జా నిర్మాణాన్ని తొలగించి రోడ్డు స్థలాన్ని ప్రజల వినియోగానికి అందుబాటులోకి తెచ్చామని వారు చెప్పారు.

### రోడ్డు స్థలాన్ని పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్



**యాదవ్:** హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేయడంతో నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ పంబల్ల సరితా రమేష్ లు కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ కి సమాచారం అందించారు. వజ్రేష్ యాదవ్ సంఘటన స్థలానికి చేరుకుని రోడ్డు స్థలాన్ని పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందిగా ఉన్న ఏ సమస్యనైనా ప్రభుత్వం పరిష్కరించాల్సిన బాధ్యత ఉన్నదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లోల కుమార్, గండి ఓం ప్రకాష్ గౌడ్, గండి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి



దోమ, మేజర్న్యూస్ (నవంబర్ 13)ః దోమ మండలపరిధిలో ని మోత్కూరు గ్రామానికి చెందిన గెరిగంటి శేషయ్య కుమారుడు చెన్నకేశవులు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి. ఈ కార్యక్రమంలో దోమ మండల మాజీ వైస్ ఎంపిపి మల్లేశం,పరిగి మండల అధ్యక్షులు ఆంజనేయులు, శేషయ్య, సంతోష్, నందయ్య, దిర్సంపల్లి అంజిలయ్య, గెరిగంటి కృష్ణయ్య,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరక్తమైసమ్మ విగ్రహం ఊరేగింపు



యాలాల మేజర్ న్యూస్ (నవంబర్ 13)ః మండలం పరిధిలోని దౌలా పూర్ గ్రామం చివరలో ఘనంగా గ్రామస్తులు నాయకుల ఆధ్వర్యంలో శ్రీరక్తమైసమ్మ దేవత ను గ్రామంలో విగ్రహ ప్రస్థాప న మహోత్సవాలు గ్రామ దేవతను ఘనంగా అమ్మవారి విగ్రహాలు, అలయ కలశాన్ని ఊరే గింపు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, నాయకులు అమ్మవారిని దర్శంచుకొని మొక్కులు చెల్లించుకొ న్నారు. అమ్మవారు శ్రీరక్త మైసమ్మ ఆలయంలోకి తీసుకెళ్లారు.

## టైగర్ జితేందర్ రెడ్డి సినిమా విడుదల సందర్భంగా ఘట్కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి అభినందనలు




ఘట్కేసర్, మేజర్ న్యూస్:జాతీయ భావజాలంతో తెలంగాణ ప్రాంతంలో 1980ల లో కదిలిన ప్రముఖ నాయకుడు ముదిగంటి జితేందర్ రెడ్డి జీవితం ఆధారంగా రూపొందించిన టైగర్ జితేందర్ రెడ్డి సినిమా ఇటీవల విడుదలైంది. ఘట్కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, తెలంగాణ ఏబీవీపీ కార్యదర్శి ఝాన్సీ, బీజేవైఎం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పవన్ రెడ్డి లతో కలిసి సినిమా చూసి, జాతీయ సమైక్యత కోసం పోరాడిన జితేందర్ రెడ్డి గారి జీవిత చరిత్రను భవిష్యత్ తరాలకు పరిచయం చేసిన దర్శక, నిర్మాతలకు అభినందనలు తెలియజేశారు.

## కడా ప్రత్యేకాధికారిని పరామర్శించిన పీఏసీఎస్ చైర్మన్, నాయకులు



కడా ప్రత్యేకాధికారిని పరామర్శించిన పీఏసీఎస్ చైర్మన్, మాజీ సర్పంచ్లు

కొడంగల్, మేజర్ న్యూస్ (నవంబరు 13): కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దుద్యాల మండలం లగచర్లలో దాడి సంఘటనలో గాయపడిన కొడంగల్ ఏరియా డెవలప్మెంట్ ఆథారిటీ ప్రత్యేకాధికారి కె.వెంకట్రెడ్డిని పీఏసీఎస్ చైర్మన్ కటకం శివకుమార్గుప్త, మాజీ సర్పంచ్లు వెంకట్రెడ్డి, శంకర్నాయక్, గోడల రామ్రెడ్డి తదితరులు పరామర్శించారు. హైదరాబాద్లో వెంకట్రెడ్డిని పరామర్శించారు.